

నేడే ఓటరు తీర్పు..

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం



ఓట్ల పండుగకు వేళయింది. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ప్రధాన ఘట్టం పోలింగ్ సోమవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఓటరు తన తీర్పును వెల్లడించనున్నారు. నూతన జిల్లాలో తొలిసారి సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. హిందూపురం పార్లమెంటు, మడకశిర, హిందూపురం, పెనుకొండ, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది. ఎన్నికల సిబ్బంది ఆదివారం రాత్రి ఆయా పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు పుట్టపర్తి, పెనుకొండలో ఈవీఎంల పంపిణీ సరళిని పరిశీలించారు. వలస వెళ్లిన వారు ఓటు వేసేందుకు సొంతూళ్లకు చేరుకున్నారు. దీంతో ఆదివారం బస్సులు, రైళ్లు కిటకిటలాడాయి. బస్టాండ్లు కిక్కిరిశాయి. అందరూ సొంతూళ్లకు చేరుకోవడంతో పల్లె, పట్నాలు కళకళలాడుతున్నాయి.

\- పుట్టపర్తి

బరిలో 91 మంది

హిందూపురం పార్లమెంటు స్థానానికి 13 మంది బరిలో ఉన్నారు. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు 78 మంది పోటీలో నిలిచారు. ఇందులో ప్రధాన పార్టీలైన టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, వైసీపీ, ఇతర పార్టీలు, స్వతంత్రులు బరిలో నిలిచారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 14,06,204 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 6,99,020 మంది, మహిళలు 7,07,120 మంది, ఇతరులు 64 మంది ఉన్నారు. ఇందులో దివ్యాంగులు 18,186 మంది, 85 సంవత్సరాలు పైబడిన వారు 7,235 మంది, 100 సంవత్సరాలు పైబడినవారు 13 మంది ఉన్నారు.

11,287 మంది ఎన్నికల సిబ్బంది

జిల్లాలో మొత్తం 1571 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వహణకు 11,287 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో పీఓలు 1875 మంది,ఏపీఓలు 1868 మంది, ఓపీఓలు 7544 మంది విధుల్లో ఉన్నారు. మొత్తం జిల్లావ్యాప్తంగా 923 వెబ్‌కెమెరాల ద్వారా పోలింగ్ నిర్వహణను రికార్డు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 171 సెక్టార్లు, 221 రూట్ల ద్వారా పోలింగ్ నిర్వహణను పరిశీలిస్తుంటారు. ఇందుకోసం సిబ్బందికి ప్రత్యేక వాహనాలు సిద్ధం చేశారు. జిల్లావ్యాప్తంగా ఈవీఎంలు, పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు 500 వాహనాలను ఏర్పాటు చేశారు. వీటిలో ఆయా నియోజకవర్గాల నుంచి సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ ముగిశాక ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలకు తరలిస్తారు.

మహిళలే ఎక్కువ



జిల్లాలో పురుష ఓటర్లకన్నా మహిళా ఓటర్లు 7200 మంది ఎక్కువగా ఉన్నారు. పెనుకొండ, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లదే పైచేయి. ఆయా నియోజకవర్గాల్లో మహిళల ఓట్లే కీలకం కానున్నాయి.

స్వగ్రామాలకు తరలి వెళ్లేందుకు వచ్చిన వారితో రద్దీగా ఉన్న ధర్మవరం బస్టాండు



జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ భారీ బందోబస్తు ఏర్పాటుచేసింది. జిల్లా పోలీసులతోపాటు కేంద్ర బలగాలను భారీగా మోహరించారు. పోలింగ్ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జిల్లావ్యాప్తంగా పోలింగ్ స్టేషన్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఇప్పటికే పోలీసు బలగాలు ఆయా పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నాయి. 299 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో వెబ్‌క్యాస్టింగ్ చేస్తున్నారు.

పోలింగ్ సమయం

07 : 00 AM

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభం కానుంది. సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనుంది. పోలింగ్ స్టేషన్లలోకి సెల్‌ఫోన్, కెమెరాలకు అనుమతి లేదు. ఎండలు మండిపోతున్న నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో పోలింగ్ అధికంగా నమోదయ్యే అవకాశం ఉంది.



ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు

జిల్లాకేంద్రం నుంచి పరిశీలన

పోలింగ్ సరళిపై జిల్లాకేంద్రం నుంచి నిరంతర పర్యవేక్షణ చేయనున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలను వెబ్ కెమెరాల ద్వారా జిల్లా కేంద్రానికి అనుసంధానం చేసి పర్యవేక్షిస్తున్నారు.

ధర్మవరానికి అదనపు బలగాలు

న్యాయస్థానం ఆదేశాలతో మోహరింపు

ధర్మవరం: సమస్యాత్మక నియోజకవర్గంగా పేరొందిన ధర్మవరానికి కేంద్ర ఎన్నికల సంఘం అదనపు కేంద్ర బలగాలను కేటాయించింది. ధర్మవరంలో ఇటీవలిగా అధికార పార్టీ నాయకులు.. ప్రతిపక్షాల వారిపై దాడులకు తెగబడుతూ భయభ్రాంతులకు లోనుచేస్తున్నారు. దీంతో కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ ధర్మవరంలో వైసీపీ ఆగడాలు మితిమీరిపోయాయనీ, ప్రతిఒక్కరూ ప్రశాంతంగా ఓటు వేసే వాతావరణం కల్పించాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అందుకు ఇటీవల జరిగిన దాడులకు సంబంధించిన క్లిప్పింగ్‌లను సైతం న్యాయస్థానం ముందు ఉంచినట్లు తెలుస్తోంది. దీనిపై స్పందించిన న్యాయస్థానం అదనపు బలగాలను కేటాయించాలని ఎన్నికల సంఘానికి సూచించింది. ఆ మేరకు ఎన్నికల సంఘం.. ఏఎస్పీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేసింది. ఆ బలగాలు ధర్మవరం చేరుకున్నాయి.

ఓటు కోసం సొంతూరికి..

ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి వస్తున్న జిల్లావాసులు

ధర్మవరం, మే 12: ఎన్నికల చరిత్రలో ఎన్నడూలేనివిధంగా ప్రవాసాంధ్రులే కాకుండా ప్రవాస భారతీయులు సైతం ఓటు కోసం స్వగ్రామాలకు తరలి వస్తుండటంతో గ్రామాలు బంధువులతో కిక్కిరిసిపోయాయి. ఖర్చులకు వెనకాడకుండా ఓటర్లు వస్తుండడం రాజకీయ విశ్లేషకులనే ఆశ్చర్యపరుస్తోంది. ఇతర దేశాల్లో ఉన్న జిల్లావాసులే కాకుండా బెంగళూరు, తెలంగాణ, చెన్నై, పుణె, ముంబై, ఒడిశా తదితర రాష్ట్రాల్లో ఉన్న వారు సైతం స్వగ్రామాలకు తరలి వస్తుండడం గమనార్హం. దీంతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. బస్సులు, రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. దీంతో ఓటు వేసేందుకు సొంతూరికి బయల్దేరిన వారు ఇబ్బందులు పడుతున్నారు. చివరికి ఆటోలు, వాహనాలు సైతం అద్దెకు తీసుకుని బృందంగా తరలివస్తున్నారు. దీనిని వాహనదారులు సొమ్ము చేసుకుంటున్నారు. చార్జీలు పెంచి వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి ధర్మవరం రావాలంటే రూ.1500 నుంచి రూ.2500 వరకు డిమాండ్ చేస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

అల్లర్లు చేస్తే ఉపేక్షించం
పోలింగ్ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ
జిల్లా ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి రూరల్, మే 12: జిల్లాలో ప్రశాంత ఎన్నికలే లక్ష్యమనీ, అల్లర్లు చేస్తే ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో పోలింగ్ స్టేషన్లలో భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ.. స్థానిక, కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తు కల్పించామన్నారు. జిల్లాలో 299 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. వాటిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు గుంపులు ఉండరాదన్నారు. వాటి పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలింగ్ ప్రక్రియ సీసీ కెమెరాల పర్యవేక్షణలో కొనసాగుతుందన్నారు. విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది అలసత్వం వహించరాదని ఆదేశించారు.



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

నిరంతర పర్యవేక్షణ

పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు తలెత్తితే వెంటనే అక్కడికి ప్రత్యేక బృందాలు చేరుకునేలా కమాండ్ కంట్రోల్ రూం పని చేస్తుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉండి తెలుసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.

ఎమ్మెల్యే కేతిరెడ్డిపై కేసు నమోదు

ధర్మవరం, మే 12: ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ధర్మవరం వన్‌టౌన్ పోలీసులు ఆదివారం తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 10న ధర్మవరం ఎన్టీఆర్ సర్కిల్‌లో కేతిరెడ్డి బహిరంగ సభ నిర్వహించారు. కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్‌ను దుర్భాషలాడారు. ఆయన కులం గురించి ప్రస్తావిస్తూ, కించపరిచేలా వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించినందుకు కేతిరెడ్డిపై ధర్మవరం మున్సిపల్ కమిషనర్, ఏఈఆర్వో రాంకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేశారు.

వైసీపీ మూకల దౌర్జన్యం

- టీడీపీ కార్యకర్తపై విచక్షణారహితంగా దాడి
- టీడీపీ ప్రచారంలో పాల్గొన్నందుకు దాష్టీకం




వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన రాజా



పుట్టపర్తి రూరల్, మే 12: జిల్లాలో వైసీపీ నాయకుల ఆగడాలకు అడ్డూఅదుపులేకుండా పోతోంది. ఓటమి భయంతో టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారు. మునిసిపాలిటీ పరిధిలోని కర్ణాటకనాగేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పెయింటర్ రాజాపై పట్టణానికి చెందిన కొందరు వైసీపీ కార్యకర్తలు సోమవారం విచక్షణారహితంగా దాడి చేశారు. 'టీడీపీ ప్రచార కార్యక్రమంలో పాల్గొంటావా? ఓటు అడిగితే వెయ్యనంటావా, ఎంత ధైర్యం రా.. నీకు' అంటూ చితకబాదారు. రాజా అపస్మారక స్థితిలో పడిపోవడంతో వెళ్లిపోయారు. అతడిని గ్రామస్థులు గుర్తించి, నీరు చల్లడంతో స్పృహలోకి వచ్చాడు. విచక్షణారహితంగా దాడి చేసినా పోలీసులు అటువైపు రాలేదని స్థానికులు పేర్కొన్నారు. దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డబ్బు కోసం వైసీపీ కార్యాలయం ముట్టడి

పురంలో ప్రతి వార్డులో ఇదే పరిస్థితి..
మండిపడుతున్న ఓటర్లు..
సత్తా చూపుతామంటూ హెచ్చరికలు..



వైసీపీ కార్యాలయాన్ని ముట్టడించిన ఓటర్లు

హిందూపురం అర్బన్, మే 12: ఎన్నికల్లో డబ్బు పంపిణీ చేసి గెలవాలన్న అధికార పార్టీ కుతంత్రం బెడిసికొట్టింది. పట్టణంలోని కొన్ని వార్డుల్లో వైసీపీ నాయకులు కొంతమంది డబ్బులిచ్చి, మరికొంతమందికి ఇవ్వకపోవడంతో వారంతా ఆగ్రహానికి లోనయ్యారు. ఆదివారం రాత్రి వైసీపీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఓటుకు రూ.రెండు వేలు ఇస్తామని వైసీపీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు.. ఓటర్లను ప్రలోభపెట్టారు. ఓటు ఉన్న వారు బీఎల్‌ఓలు ఇచ్చిన స్లిప్‌లు చూపితే ఓటుకు రూ.2 వేలు ఇస్తామన్నారు. కొంతమందికి ఇంటికే వెళ్లి ఇచ్చారు. మిగిలిన వారు సాయంత్రం దాకా ఎదురు చేశారు. కౌన్సిలర్ల ఇళ్ల వద్దకు గుంపులుగా వెళ్లారు. ఎంతసేపటికీ స్పందించకపోవడంతో వైసీపీ కార్యాలయాన్ని ముట్టడించారు. కౌన్సిలర్లు తమకు కవావాల్సిన వారికి డబ్బు ఇచ్చి, తమకు పంపిణీ చేయలేదని మండిపడ్డారు. ఓటుతో తమ సత్తా చూపుతామని ఆగ్రహంగా ప్రకటించారు. కౌన్సిలర్ల ఇళ్లను కూడా ముట్టడించారు. వైసీపీపై దుమ్మెత్తిపోశారు. ఎలా గెలుస్తారో చూస్తామని హెచ్చరించారు. డబ్బుతో ఓటర్లను కొనాలనే వైసీపీ తప్పుడు ఆలోచనే కొంప ముంచిందని పట్టణ వాసులు పేర్కొంటున్నారు. నోటుతో ఓటర్లను ప్రసన్నం చేసుకుందామనుకుంటే ఇలా తిరగబడిందేమిటని వైసీపీ నాయకులు, కౌన్సిలర్లు తలలు పట్టుకుంటున్నారు. వైసీపీ పెద్దలు రెండ్రోజులుగా కనిపించకుండా పోయారు. ఎక్కడ ఉన్నారో దిగువస్థాయి నాయకులకు కూడా తెలియడం లేదు. ఇది స్థానిక నాయకులకు కోపం తెప్పించింది. వలంటీర్లు ఇచ్చిన లిస్ట్ ప్రకారమే ఆ పార్టీ నేతలు డబ్బు పంపిణీ చేసినట్లు సమాచారం. ఇందులో వైసీపీకి ఓటు వేస్తారన్న నమ్మకం ఉన్నవారికే ఇచ్చారని తెలుస్తోంది. తటస్థులకు పంపిణీ చేయలేదని తెలుస్తోంది. ఈ కారణంతో పట్టణంలో 30శాతం మంది ఓటర్లకు కూడా డబ్బు చేరలేదని ఆ పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు. ఇలా అయితే పార్టీకి ఓట్లు ఎలా పడతాయని నిలదీస్తున్నారు. ఓటర్ల ఇళ్లవద్దకు వెళ్లడానికి కూడా ఇబ్బందిగా మారిందంటున్నారు. పోలింగ్‌రోజు ఇళ్ల వద్దకెళ్లి ఓటర్లను పోలింగ్ కేంద్రానికి ఎలా తీసుకురావాలని ముఖ్యనేతలు ప్రశ్నిస్తున్నారు.

ఇలా అయితే పోలింగ్ చేయలేం..

చేతులెత్తేసిన ద్వితీయశ్రేణి నాయకులు

హిందూపురం, మే 12: సార్వత్రిక ఎన్నికలు పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. అధికార పార్టీ నాయకులు పెద్దఎత్తున ప్రలోభాలకు తెరలేపారు. ఓటుకు రూ.2వేలు పంచడానికి సిద్ధమయ్యారు. పార్టీ ఐదేళ్లుగా అధికారంలో ఉండి కూడా ఏమీ సంపాదించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామనీ, ఎన్నికల సమయంలో అయినా తమవైపు చూస్తారని ఎంతో ఆశగా ద్వితీయ శ్రేణి నాయకులు ఎదురుచూశారు. పోలింగ్ ముందురోజు వరకు ద్వితీయ శ్రేణి నాయకులను పట్టించుకోకపోవడంతో వారంతా గుర్రుగా ఉన్నారు. ఓటర్లకు పంచడానికి డబ్బు తీసుకొచ్చినా నాయకుల ఆధ్వర్యంలో కాకుండా బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వారితో పంపకాలు చేశారు. దీంతో ద్వితీయశ్రేణికి మరింత కోపమొచ్చింది. ఈ పరిస్థితుల్లో ఆదివారం వైసీపీలోని ద్వితీయశ్రేణి నాయకులు.. ముఖ్య నేతల వద్దకెళ్లి ఇలా అయితే తాము పోలింగ్ చేయలేమని చేతులెత్తేశారు. దీంతో చేసేదిలేక కొన్నిచోట్ల వారి ఆధ్వర్యంలోనే పంపకాలకు సిద్ధమైనా అధికశాతం ఇతర ప్రాంతాలకు చెందినవారితోనే పంచారు.



రోజంతా నాయకుల పడిగాపులు

హిందూపురం పట్టణంతోపాటు రూరల్ మండల నాయకులకు ఓటర్లకు పంచేందుకు తగినంత డబ్బు ఇవ్వలేదని ఆ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఆదివారం వైసీపీ సమన్వయకర్త ఇంటివద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వచ్చింది. పోలీసు బందోబస్తు అధికంగా ఉందనీ, బయటి నుంచి డబ్బు తీసుకురావడానికి వబ్బందిగా ఉందని ముఖ్య నేతలు చెప్పారు. ఆఖరికి ఆదివారం సాయంత్రం కొంతమందికి పంపిణీ చేయాలని డబ్బులిచ్చారు. అందులో కూడా షరతులు విధించడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మండిపడ్డారు. ఏదిఏమైనా హిందూపురం నియోజకవర్గంలో డబ్బు పంపిణీ విషయంలో ఆ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు తీవ్ర ఆవేదనకు లోనైనట్లు సమాచారం.

సబ్‌జైలును తనిఖీ చేసిన జిల్లా న్యాయాధికారి



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి

ధర్మవరం, మే 12: స్థానిక సబ్‌జైలును ఆదివారం జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ తనిఖీ చేశారు. సబ్‌జైలులో రికార్డులను, ప్రతి గదిని పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. భోజనం, వసతులపై ఆరాతీశారు. ఎవరికైనా న్యాయవాది లేకపోతే ఏర్పాటు చేస్తామని ఖైదీలకు జిల్లా న్యాయాధికారి సూచించారు. జిల్లా న్యాయాధికారి వెంట ధర్మవరం సీనియర్ సివిల్ న్యాయాధికారి గీతావాణి, జూనియర్ సివిల్ న్యాయాధికారి రమ్యసాయి, సబ్‌జైలు సూపరింటెండెంట్ బ్రహ్మారెడ్డి ఉన్నారు.

వారి ఓట్లు అలాగే ఉంచేశారు..!



ఎన్నికల నిబంధనల ప్రకారం 18ఏళ్ల నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలి. అయితే అనంతపురంరూరల్ మండలంలోని అధికారులు ఇవే పట్టించుకోకుండా 16ఏళ్లవారికి సైతం ఓటు హక్కు కల్పించారు. మండలంలోని క్రిష్ణంరెడ్డిపల్లిలో ఆధార్‌లో పుట్టిన సంవత్సరాన్ని మార్చి ఓటర్లుగా నమోదు చేశారు. వారి వివరాలను ఆధారాలతో 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. ఈక్రమంలో అధికారులు వాటి తొలగింపునకు చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. అయితే ఇటీవల విడుదలైన కొత్త ఓటరు జాబితాలో వయస్సు తక్కువ వారి ఓట్లను అలానే ఉంచారు. దీనిబట్టి చూస్తే విధుల పట్ల ఆ అధికారులు ఎంత అంకితభావంతో పనిచేస్తున్నారో అర్థం అవుతోంది. - అనంతపురంరూరల్

ప్రలోభాలకు లొంగకండి

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, మే 12 : ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఓటు వేస్తున్న ఓటర్లకు, ఎన్నికలు నిర్వహిస్తున్న సిబ్బందికి ఆయన ఆల్ ద బెస్ట్ చెప్పారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రశాంత పోలింగ్‌కు అందరూ సహకరించాలన్నారు. పోలింగ్ సిబ్బంది, పోలీసులు సైతం ఒత్తిళ్లకు తలొగ్గకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు చేపట్టామని, 144 సెక్షన్ అమలలో ఉందని పోలింగ్‌కు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటరు కార్డు లేకపోయినా కమిషన్ నిర్దేశించిన 12 రకాల గుర్తింపుకార్డులు చూపించి జాబితాలో పేరు ఉన్నవారు ఓటుహక్కును వినియోగించుకోవచ్చన్నారు. కలెక్టరేట్‌లో పోల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు చేశామని, ఇక్కడి నుంచే అన్ని పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తామన్నారు. జిల్లాలో 20,18,162 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఇందులో 10,20,124 మంది మహిళలు, 9,97,792 మంది పురుషులు, 246 మంది థర్డ్ జెండర్ ఉన్నారని పేర్కొన్నారు. వందేళ్లు పైబడిన ఓటర్లు 31 మంది ఉండగా, 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 25,211 మంది ఉన్నారన్నారు. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే యువ ఓటర్లు జిల్లాలో 49,234 మంది ఉన్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

బంధువులైతేనే రూ. 2 వేలు..!



చికెన్, పలావ్ అందరికీ

ఎన్నికల వేళ వైసీపీ డబ్బుల పంపిణీలో చిత్ర విచిత్ర సన్నివేశాలు చోటుచేసుకుంటున్నాయి. ఒక్కో ఓటుకు రూ.2వేలు చొప్పున పంచేందుకు అభ్యర్థులు.. వారి నాయకులకు అందజేస్తున్నారు. అయితే ఓటరుకు పంచేటప్పుడు మాత్రం నాయకులు వారి బంధువులైతేనే రూ.2వేలు ఇస్తున్నారు. ఇతరులకైతే రూ.1000 పంచి మిగిలిన మొత్తాన్ని జేబులోకి తోస్తున్నారు. అదేవిధంగా చికెన్, పలావు, బిర్యాని మాత్రం అందరికీ పిలిచిపిలిచి మరీ పెడుతున్నారు. ఓటర్లు ఈ సన్నివేశాలను తలుచుకుంటూ వైసీపీ నాటకాలకు ఓటుతోనే బుద్ధిచెబుతామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - అనంతపురం సెంట్రల్

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేనా..?

వెంటాడుతున్న పోలీసు సిబ్బంది కొరత

కవాతులతో సరిపెడుతున్న పోలీసు అధికారులు

ఎన్నికల వేళ ప్రజల్లో భయాందోళనలు

తాడిపత్రిటౌన్, మే 12: రాష్ట్రంలోనే అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాల్లో ఒకటైన తాడిపత్రిలో ఎన్నికల సందర్భంగా ప్రజల భద్రతపై సందేహాలు నెలకొన్నాయి. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఈ ప్రాంతంలో దాడులు, ప్రతిదాడులు, హత్యలు జరుగుతుండడం పరిపాటిగా మారింది. గత ఎన్నికల్లో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు కేవలం కవాతులతో సరిపెడుతున్నారు. పోలీసుల తీరు చూస్తుంటే ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. తాడిపత్రి పేరు వింటేనే ఫ్యాక్షన్, దాడులు, హింసాత్మక సంఘటనలు గుర్తుకు వస్తాయి. సాధారణ రోజుల్లోనే నియోజకవర్గంలో ఎక్కడో ఒకచోట తరచూ గొడవలు జరుగుతూనే ఉంటాయి. నియోజకవర్గంలో తాడిపత్రి, యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాలు ఉన్నాయి. అసెంబ్లీ, మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు ఏవి జరిగినా ఇక్కడ పనిచేసే పోలీసు అధికారుల్లో టెన్షన్ నెలకొని ఉంటుంది. నాలుగు దశాబ్ధాల రాజకీయ చరిత్ర కలిగిన జేసీ ఫ్యామిలీ, అదేస్థాయిలో రాజకీయ అనుభవం కలిగిన కేతిరెడ్డి ఫ్యామిలీలు ఎన్నికల్లో ప్రధాన పార్టీల తరఫున పోటీలో ఉండడమే ప్రధాన కారణం. రెండు కుటుంబాలు ఢీ అంటే ఢీ అంటుండడంతోనే ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఎన్నికల పరంపర

తాడిపత్రి అసెంబ్లీ స్థానానికి పోటీపడుతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారంలోగానీ, రోడ్‌షోల్లో గానీ, నాయకులు, కార్యకర్తల కోలాహలంలో గానీ ఒకరికి మించి మరొకరు పోటీ పడుతుంటారు. గత ఎన్నికలను ఒకసారి పరిశీలిస్తే. 2004 ఎన్నికల్లో టీడీపీ తరఫున కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి జేసీ దివాకర్‌రెడ్డి పోటీ పడ్డారు. ఇద్దరూ ఒకేరోజు నామినేషన్ వేయడంతో ఇరువర్గాలు పెద్దఎత్తున రాళ్లు రువ్వుకున్నాయి. దీంతో పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున జేసీ దివాకర్‌రెడ్డి, టీడీపీ నుంచి పేరం నాగిరెడ్డి పోటీపడ్డారు. ఇరువర్గాలు రాళ్లవర్షం కురిపించడంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అప్పట్లో టీడీపీ అభ్యర్థి పేరం నాగిరెడ్డి కాలర్‌ను సీఐ పట్టుకోవడం సంచలనం రేపింది. 2014ఎన్నికల్లో టీడీపీ నుంచి జేసీ ప్రభాకర్‌రెడ్డి, వైసీపీ తరఫున వీఆర్ రామిరెడ్డి పోటీలో నిలిచారు. ఈ ఎన్నికల్లో కూడా ఘర్షణలు, దాడులు చోటుచేసుకున్నాయి. 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున జేసీ ప్రభాకర్‌రెడ్డి కుమారుడు జేసీ అశ్మిత్‌రెడ్డి, వైసీపీ నుంచి కేతిరెడ్డి పెద్దారెడ్డి తలపడ్డారు. ఈ ఎన్నికల్లో పట్టణంలోని గర్ల్స్‌హైస్కూల్ సమీపంలో టీడీపీ అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిపై వైసీపీ అల్లరి మూకలు దాడులకు ప్రయత్నించడంతో ఏం జరుగుతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మండలంలోని వీరాపురం గ్రామంలో ఓటింగ్ నిర్వహణ సరిగా లేదని చెప్పిన టీడీపీ కార్యకర్త భాస్కర్‌రెడ్డిని వైసీపీ వర్గీయులు హత్య చేయడంతో అప్పట్లో రాష్ట్రం ఉలిక్కిపడేలా చేసింది. యాడికి మండలం వెంగన్నపల్లిలో టీడీపీ, వైసీపీ వర్గీయులు బాహాబాహీకి దిగి పరస్పర దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించి టీడీపీ వర్గీయులు 20 మంది, వైసీపీ వర్గీయులు 20 మందిపై కేసులు నమోదు చేశారు. చింతలాయపల్లిలో వృద్ధ ఓటర్లను పోలింగ్ బూత్‌లకు తీసుకువెళ్లే విషయమై టీడీపీ, వైసీపీ వర్గాలు గొడవపడి రాళ్ల దాడిచేసుకున్నాయి. యల్లనూరు మండలం జంగంపల్లి, చింతకాయమంద గ్రామాల్లో ఏజెంట్ల విషయంలో వైసీపీ, టీడీపీ వర్గీయులు దాడి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో నేడు ఎన్నికలు ఎలా జరుగుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్

సిబ్బంది కొరత

రాష్ట్రంలోనే సమస్యాత్మక ప్రాంతమైన తాడిపత్రిలో తగినంతమంది పోలీసు అధికారులను, సిబ్బందిని నియమించడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. తాడిపత్రిపట్టణ జనాభా దాదాపు లక్షకు పైగా ఉంది, కానీ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య చాలా తక్కువ ఉంది. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నిబంధనల మేరకు సీఐతో పాటు నలుగురు ఎస్‌ఐలు, 46 మంది సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఒక సీఐతోపాటు ఎస్‌ఐ, 10మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహించడం బట్టిచూస్తే ఈ ప్రాంతంపై పోలీసు ఉన్నతాధికారులు ఎంత శ్రద్ధపెడుతున్నారో అర్థమవుతుంది. తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది పరిస్థితి కూడా ఇలాగే ఉంది. నియోజకవర్గంలోని యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతారా..?

నియోజకవర్గంలో అసాంఘిక, అరాచక శక్తులపై పోలీసు అధికారులు ఉక్కుపాదం మోపుతారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొరవడిన సిబ్బందితో మట్కా, పేకాట వంటి కార్యకలాపాలనే పోలీసులు కట్టడి చేయడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కక్షలు, కార్పణ్యాల మధ్య జరిగే ఈ ఎన్నికలను ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ ప్రాంతంలో పోలీసు ఉన్నతాధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించుకొని అమలుచేయాల్సి ఉండగా ఇప్పటికి అలాంటి కార్యాచరణ మొదలుపెట్టకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గత ఎన్నికల్లో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని పోలీసు అధికారులు అప్రమత్తం కాకుంటే చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా మరోసారి ఘర్షణలకు తాడిపత్రి కేంద్రబిందువుగా మారనుందనడంలో సందేహం లేదు.



ఎస్సీ, ఎస్టీలకు

దొంగదెబ్బ..!

ఆయా కాలనీల్లో ఉన్నవారికే ఉచిత విద్యుత్

ఉమ్మడి జిల్లాలో 14వేల కనెక్షన్లకు సబ్సిడీ తొలగింపు

జగన్ పాలనపై బాధితుల ఆగ్రహం



విద్యుత్ శాఖ కార్యాలయం

అనంతపురం రూరల్, మే 12: నా ఎస్సీ, నా ఎస్టీ అంటూ ఆయా వర్గాలను బ్రహ్మాండంగా ఉద్ధరించినట్లు నిత్యం సభలు, సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఊదరగొట్టడం చూస్తుంటం. అయితే ఆ వర్గాలకే సడీ చప్పుడు కాకుండా జగన్ దొంగ దెబ్బ వేశాడు. చిన్న మెలిక పెట్టి వారికి ఉచిత విద్యుత్ లేకుండా చేశాడు. టీడీపీ హయంలో ఎస్సీ, ఎస్టీకు ఉచిత విద్యుత్ అందింది. తమ పార్టీ అధికారంలోకి వస్తే 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చాక..నమ్మి ఓట్లేసిన వారినే దెబ్బతీశాడు. దళిత వాడల్లో ఉన్న వారికే ఉచిత విద్యుత్ అంటూ నిబంధన పెట్టి సబ్సిడీ విద్యుత్‌ను తొలగించేశాడు. ఇలా ఉమ్మడి జిల్లాలో 14వేల కనెక్షన్లకు సబ్సిడీ విద్యుత్‌ను విద్యుత్ అధికారులు నిలిపివేశారు. దీంతో ఆయా వర్గాల సభ్యులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ఎక్కడైనా ఉన్న సబ్సిడీని మరింత పెంచే విధంగా నిర్ణయాలు ఉండాలిగాని..తొలగించడమేటంటూ ఆయా వర్గాల సభ్యులు వైసీపీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీలంటే కేవలం ఆయా కాలనీల్లో మాత్రమే ఉండాలా? మరో చోట ఉండకూడదా? ఇదెక్కడి న్యాయం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నా ఎస్సీ, నా ఎస్టీ కేవలం మాటలకేనంటూ పెదవిరుస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1.65లక్షల కనెక్షన్లు..

ఉమ్మడి జిల్లా విద్యుత్‌శాఖ పరిధిలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 1.65లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 1.28లక్షలు ఎస్సీలకు కనెక్షన్లు ఉండగా, మరో 36వేల కనెక్షన్లు ఎస్టీలకు సంబంధించినవి. వీటిలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో లేని వారికి సంబంధించిన 14వేల సర్వీసులను గుర్తించారు. వారందరికీ ఉచిత విద్యుత్‌ను తొలగించేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇందు లో అనంతపురంలో 5వేల కనెక్షన్లు, కదిరి ప్రాంతంలో పదిహేనువందల కనెక్షన్లు, పెనుకొండ ప్రాంతంలో ఆరువందలు, మడకశిర ప్రాంతంలో 200 కనెక్షన్లు ఇలా ఉమ్మడి జిల్లాలోని ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో లేనివారికి రాయితీ విద్యుత్‌ను నిలిపివేశారు. ఇదేనా జగన్ ప్రభుత్వానికి ఎస్సీ, ఎస్టీల పట్ల ఉన్న చిత్తశుద్ధి అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పోలింగ్ సిబ్బందితో ఆడుకున్న ఆర్వో

అనంత అర్బన్‌లో రాత్రిపూట వెళ్లిపోవాలని హుకుం

నీళ్లు, భోజనం లేక మహిళా సిబ్బంది ఆవేదన

ఓపీఓలకు రూ.500 ఇచ్చి పత్తాలేని అధికారులు

అనంతపురం అర్బన్, టౌన్ 12 : పోలింగ్ సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించామని కలెక్టర్ పదేపదే చెబుతున్నా జిల్లా కేంద్రంలో ఉండే అనంతపురం అర్బన్ ఎన్నికల అధికారులు పోలింగ్ సిబ్బందితో ఆడుకుని నానా ఇబ్బందులకు గురిచేశారు. కనీసం నీళ్లు, భోజనం లేక అవస్థలు పడిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎన్నికల నిర్వహణలో భాగంగా వివిధ నియోజకవర్గాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులను పీఓ, ఏపీఓలు, ఓపీఓలుగా నియమించారు. వారందరికీ రెండుసార్లు శిక్షణ ఇచ్చి ఆదివారం ఎన్నికల డ్యూటీకి రమ్మన్నారు. ఉదయమే ఇక్కడికి చేరుకొని డ్యూటీకి జాయిన్ అయ్యారు. రిజర్వ్‌లో ఉన్నారని, వారికి ఎక్కడ అవసరమైతే అక్కడికి పంపుతామని అందరూ ఉండాలని స్టేజీ మీద ఉన్న ఆర్వో గ్రంధి వెంకటేష్, అసిస్టెంట్ ఆర్వో శివరామిరెడ్డి, ఇతర అధికారులు మైకులో చెబుతూ వచ్చారు. దీంతో దాదాపు వందమందికి పైగా అక్కడే ఉన్నారు. అధికారులు రాత్రి 8 గంటల సమయంలో మీరు అవసరంలేదు..ఇళ్లకు వెళ్లండని చెప్పారు. ఆ సమయంలో అక్కడ ఉన్న గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, తాడిపత్రి, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాలకు చెందిన పోలింగ్ సిబ్బంది ఈ సమయంలో ఎలా పోవాలని ప్రశ్నించారు. అందుకు ఓపీఓలకు ఒక్కొక్కరికి రూ. 500 ఇచ్చి వెళ్లి పోండని, పీఓ, ఏపీఓలు ఉండాలని చెప్పి అక్కడున్న ఉన్న అధికారులు మాయమైపోయారు. రాత్రి 9 గంటలైనా నీళ్లు లేవు, భోజనం లేదు, అధికారులు అక్కడికి రాలేదు. దీంతో బిక్కుమొహం వేసుకొని అక్కడే ఉండడం కనిపించింది, కొందరు వెళ్లి పోగా.. మహిళా సిబ్బంది పరిస్థితి ఉండాలా.. ఉంటే ఎక్కడ ఉండాలి అని ఆందోళనగా కనిపించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రిజర్వులో ఉన్న సిబ్బందికి రాత్రి పూట పడుకోవడానికి వసతులు, భోజన ఏర్పాట్లు చేయాలి. అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఎన్నికల అధికారులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ కనీసం వాళ్లకు నీళ్లు, అన్నం కూడా పెట్టలేదు. మరోవైపు మహిళా సిబ్బంది రాత్రిపూట ఎక్కడికి వెళతారని కనీసం ఆలోచించకుండా ఇలా ఆడుకోవడం ఏమిటన్న ఆరోపణలు వినిపించాయి.



అధికారులు వెళ్లిపోవడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే కూర్చున్న పోలింగ్ సిబ్బంది

చేనేతకు జీఎస్టీ గుదిబండ

వైసీపీ పాలనలో తగ్గిన పట్టుచీరల వ్యాపారం


జీఎస్టీ రీయింబర్స్‌మెంట్‌కు చంద్రబాబు హామీ

అనంతపురం సెంట్రల్, మే 12: పట్టు వస్త్రాలకు గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్(జీఎస్టీ) గుదిబండలా మారింది. వ్యాపారంలో ప్రతి రూ.100కు రూ.5 చొప్పున జీఎస్టీని చెల్లిస్తున్నారు. సంవత్సరానికి పెద్ద మొత్తంలో జీఎస్టీ కడుతున్నామని వైసీపీ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని వ్యాపారులు మండిపడుతున్నారు. చేనేత వస్త్రాలంటేనే ఖరీదుతో కూడుకున్నవి. తక్కువ లాభంతోనే వ్యాపారాలు చేస్తున్న తమకు జీఎస్టీ గుదిబండలా మారిందని వాపోతున్నారు. తయారీ దారుల నుంచి కొనుగోలుచేసి రవాణా చేయడానికి తడిసిమోపెడు అవుతుంటే అదనంగా జీఎస్టీ కట్టాల్సి వస్తోందని మండిపడుతున్నారు. గత ప్రభుత్వంలో ఎంత మొత్తం సరుకు కొన్నా.. అమ్మంకాని వాటిని తయారీదారులు వెనక్కి తీసుకునేవారు. వైసీపీ ప్రభుత్వంలో జీఎస్టీ అమలుకావడంతో తయారీదారులు వెనక్కి తీసుకోవడంలేదు. అదేవిధంగా ధరలు పెంచారు. దీంతో అమ్మకాలు పూర్తిగా తగ్గిపోయాని వ్యాపారులు అవేదన చెందుతున్నారు.

జీఎస్టీ రీయింబర్స్‌మెంట్‌కు చంద్రబాబు హామీ

ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే పట్టువస్త్రాల వ్యాపారులకు జీఎస్టీ సొమ్మును రీయింబర్స్‌మెంట్ రూపంలో వెనక్కి చెల్లిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. విద్యార్థులకు కళాశాలల ఫీజులు, ఆసుపత్రులకు కట్టే వైద్య ఖర్చులకు చెల్లించే రీయింబర్స్‌మెంట్ లాగా చేనేత వస్త్రాల వ్యాపారులకు జీఎస్టీ మొత్తాన్ని తిరిగి ఇచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రీయింబర్స్‌మెంట్ హామీ వరం



సరుకు కొనుగోలు మొత్తంలో ఐదు శాతం జీఎస్టీని కడుతున్నాం. ఈ మొత్తాన్ని రీయింబర్స్‌మెంట్ చేస్తామని చంద్రబాబునాయుడు హామీనివ్వడం మాలాంటి వ్యాపారులకు వరం. ఇప్పటికే రవాణా ఖర్చులు పెరిగిపోయాయి. వాటికి అదనంగా జీఎస్టీ చేరడంతో భారంపెరిగింది. దీంతో వ్యాపారాలు తగ్గిపోయి నష్టాల్లో చిక్కుకునాం. రూ.5లక్షల సరుకులో దాదాపు రూ.2లక్షల వరకు వెనక్కి తీసుకునేవారు. జీఎస్టీ కారణంగా తయాదారులు వెనక్కి తీసుకోవడంలేదు.

- అమర్నాథ్, పట్టువస్త్రాల వ్యాపారి, రాచానపల్లి, అనంతపురం మండలం

అమ్మను చూడందే ఉండలేను

మాజీ మంత్రి పరిటాల సునీత

రామగిరి, మే 12: రాజకీయంగా ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంత పెద్ద కుటుంబంలో ఉన్నా, మా అమ్మ త్యాగాన్ని మరువలేనని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని వెంకటాపురంలోని తన నివాసంలో ఆమె తల్లి సరస్వతమ్మ వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. సోమవారం పోలింగ్ ఉన్నప్పటికీ ప్రత్యేకంగా తన తల్లితో కాసేపు గడిపారు. పరిటాల సునీత సోదరి లక్ష్మితో కలిసి తల్లి సరస్వతమ్మ వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ ఎన్నికలలో విజయం సాధించాలని సునీతను తల్లి ఆశీర్వదించారు. అనంతరం పరిటాల సునీత మాట్లాడుతూ...ఆ రోజు గృహిణిగా ఉన్నా, మంత్రి అయినా, ఇప్పుడు రాజకీయాల్లో బిజీగా ఉన్నా నేను ఎప్పుడు మా అమ్మను చూడందే ఉండలేను అన్నారు. బాధ్యతలు ఎలా సమర్థవంతంగా నిర్వర్తించాలో అమ్మ నుంచే నేర్చుకున్నానన్నారు. ఆమె లేనిదే తాను లేను అని ఉద్వేగభరితంగా తెలిపారు.



తల్లితో మాతృ దినోత్సవాన్ని జరుపుకుంటున్న పరిటాల సునీత, సోదరి లక్ష్మి

ఎన్నికలకు ఎమ్మెల్యే బస్సా..?

టీడీపీ నాయకుల అభ్యంతరం



ఎన్నికల సామగ్రిని తరలించడానికి వచ్చిన ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల బస్సు

బుక్కరాయసముద్రం, మే12: ఎన్నికల సామగ్రిని తరలించడానికి సిట్టింగ్ ఎమ్మెల్యే బస్సు వాడకున్న సంఘటన ఆదివారం శింగనమల నియోజకవర్గంలో జరిగింది. సోమవారం పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో శింగనమల నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల విధుల కోసం నియమించిన సిబ్బంది, సామగ్రిని తరలించడానికి సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి చెందిన ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల బస్సులను ఉపయోగించారు. మండలంలోని వెంకటాపురం గ్రామం పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఎస్ఆర్ఐటీ బస్సును ఆదివారం రాత్రి వెనక్కి పోవాలని పలువురు టీడీపీ నాయకులు ఆందోళన చేశారు. ఈ విషయం పై నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణీశ్రీ, ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబుల నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నలశీనుకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎస్ఆర్ఐటీ కళాశాలకు చెందిన బస్సులను వెనక్కి పంపించారు. ఆ స్థానంలో మరో బస్సును ఏర్పాటు చేశారు.

ప్రలోభాల పర్వం

మహిళా ఓటర్లకు చీరల పంపిణీ



యాడికి, మే12: ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు ఆదివారం చివరిరోజు కావడంతో వైసీపీ ప్రలోభాలకు తెరలేపింది. మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు వైసీపీ నాయకులు చీరల పంపిణీ చేపట్టారు. రాయలచెరువులో వైసీపీ నాయకులు చీరలు పంపిణీ చేస్తుండగా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. చందనలో వైసీపీ నాయకులు చీరల పంపిణీకి తెరలేపారు.

గుడిపాడులో ఘర్షణ

మండలంలోని గుడిపాడులో ఆదివారం తెల్లవారుజామున ఒక వర్గం వారు మహిళా ఓటర్లకు చీరలు పంపిణీ చేస్తుండటంతో మరొకవర్గం వారు అడ్డుకోబోయారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనలో గజేంద్ర అనే వ్యక్తి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. దీనిపై సీఐ నాగార్జునరెడ్డిని వివరణ కోరగా బాధితులు ఇంకా ఫిర్యాదు ఇవ్వలేదని తెలిపారు.

నగరూరులో వైసీపీ ప్రచారం

నగరూరు గ్రామంలో ఆదివారం వైసీపీ నాయకులు మోడల్ ఈవీఎంతో ప్రచారానికి దిగారు. సమాచారం అందుకున్న టీడీపీ వర్గీయులు అడ్డుకోబోయారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైసీపీ నాయకులు తిరిగి వెనక్కి వెళ్లడంతో టీడీపీ వర్గీయులు శాంతించారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

కూపన్‌లు ఇచ్చారు సరే.. డబ్బులు ఏవీ..?

మంత్రి ఉష శ్రీచరణ్ ఇంటి వద్ద ముస్లిం కుటుంబాల నిరీక్షణ



కూపన్‌లను చూపుతున్న దర్గా ప్రాంతవాసులు

పెనుకొండ టౌన్, మే 12: మంత్రి ఉషశ్రీ చరణ్ ఫొటోతో ఉన్న కూపన్‌లు ఇచ్చారు సరే మరి డబ్బులేవీ అని పలువురు ముస్లింలు మండిపడ్డారు. ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశ్యంతో మంత్రి ఫొటోతో ఉన్న కూపన్‌లను ఇంటింటికి పంపిణీ చేశారు. కూపన్ ఉన్న ప్రతి ఒక్కరికి రూ. 1500 చొప్పున ఇస్తామని నమ్మబలికారు. అయితే డబ్బులు ఇవ్వకపోవ డంతో ఆదివారం కూపన్‌లతో మంత్రి ఇంటి వద్ద గంటల తరబడి వేచి ఉన్నారు. ఎంత సేపటికి ఎవరూ స్పందించకపోవడంతో వైసీపీ తీరుపై ఆగ్రహించారు. అయితే అక్కడే ఉన్న వైసీపీ నాయకులు మంత్రి ఇంటి లైట్లు ఆపివేశారు. దీంతో వారు బండబూతులు తిట్టుకుంటూ వెనుతిరిగి వెళ్లారు. పెనుకొండ దర్గా వెనుక భాగంలో ఉన్న ముస్లిం కుటుంబాలకు నాలుగు రోజుల కిందట వలంటీర్ల ద్వారా కూపన్‌లు అందించి, తొందర్లో డబ్బులు ఇస్తామని చెప్పారు. సోమవారం ఓటింగ్ కూడా జరుగనుంది. అయినా ఇంత వరకు తమ ప్రాంతానికి ఎవరూ రాకపోవడంతో తామే ఇక్కడకి వచ్చినట్లు వారు తెలిపారు. కూపన్‌లు ఇవ్వడమెందుకు, మోసం చేయడమెందుకు అంటూ మండిపడ్డారు. సోమందేపల్లి, పెనుకొండ మండలాల్లో కూపన్‌లు అందించిన వారికి డబ్బు ఇవ్వలేక సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నారట. దీంతో ఆగ్రహించిన ఓటర్లు ఎన్నికల్లో తమ సత్తా చూపుతామని ఆగ్రహించారు.

ఓటరు కోసం సెల్ఫీ స్పాట్



అనంతపురం కోర్టు రోడ్డు నెహ్రూ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్

అనంతపురం విద్య, మే 12: తాము ఓటేశామని చూపుడు వేలికి ఉన్న సిరా గుర్తును చూపడం కొందరికి సరదా. తొలిసారి ఓటు వేసిన యువత అయితే ఫొటోలు దిగి, వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తుంటారు. అందుకే ఎన్నికల అధికారులు కూడా ప్రస్తుత ఎన్నికల్లో ఓటర్లు సెల్ఫీ తీసుకోవడానికి ఓ స్పాట్‌ను ఏర్పాటు చేశారు. నగరంలోని కోర్టు రోడ్డు నెహ్రూ మున్సిపల్ అప్పర్‌ప్రైమరీ స్కూల్ పోలింగ్ కేంద్రాల్లోని ఓటర్ల కోసం జిల్లా ఎన్నిల అధికారులు సెల్ఫీ స్పాట్ పెట్టారు. ఓటు వేసి వచ్చిన ఓటర్లు సెల్ఫీ తీసుకునేందుకు వీలుగా ఇక్కడ ఏర్పాట్లు చేశారు. దీన్ని నగరంలోని పోలింగ్ కేంద్రాలకు మోడల్ పోలింగ్ కేంద్రంగా అధికారులు చెబుతున్నారు. మరెందుకు ఆలస్యం ఈ కేంద్రంలో ఓటు ఉన్న వారు ఓటు వేసి సెల్ఫీ దిగి స్మార్ట్‌గా పోస్ట్ పెట్టేయండి.

31 మంది ఓటర్లకు వందనం



అనంతపురం జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో వందేళ్ల పైబడి ఉన్న ఓటర్లు 31మంది ఉన్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. వీరంతా సోమవారం జరగనున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలలో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో ఇద్దరు, ఉరవకొండలో 9 మంది, గుంతకల్లులో ఏడుగురు, తాడిపత్రిలో ఇద్దరు, శింగనమలలో ఒకరు, అనంతపురం అర్బన్‌లో ఒకరు, కళ్యాణదుర్గంలో ఒకరు, రాప్తాడు నియోజకవర్గంలో ఎనిమిది మంది వందేళ్ల పైబడిన ఓటర్లు ఉన్నారు.

- అనంతపురం టౌన్

రాప్తాడులో కొరవడిన సమన్వయం..!

రాప్తాడు నియోజకవర్గంలో ఎన్నికల అధికారుల మధ్య సమన్వయం కొరవడింది. సాధారణ ఎన్నికల పోలింగ్ సోమవారం ఉదయం ప్రారంభం కానున్నాయి. అయితే ఇంత వరకు సంబంధిత అధికారుల నుంచి పోలింగ్ కేంద్రాల వివరాలు, ఏర్పాట్లు, సిబ్బంది కేటాయింపు వంటివీ ఏమాత్రం తెలియజేయని పరిస్థితి. రాప్తాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్ద మీడియా పాయింట్ ఉన్నా..అక్కడి నుంచి సంబంధిత మీడియా బృందానికి ఎలాంటి సమాచారం ఉండటం లేదు. మీడియా బృందం సభ్యులు ఏదైనా సమాచారం కోసం ఫోన్ ద్వారా సంప్రదించినా సరైన సమాచారం ఉండటం లేదు. ఒక్కో సందర్భంలో ఫోన్ కూడా లిఫ్ట్ చేయని పరిస్థితి నెలకొంది. పక్క నియోజకవర్గాల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారితో పాటు ఏఈఆర్‌ఓలు ఇతర సిబ్బందికి మీడియా సెల్ ద్వారా సమాచారం ఉంటోంది. రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉండటంలేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నా యి. ఇంత గోప్యంగా ఎన్నికల నిర్వహణ చేయల్సిన అవసరం ఏముందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

- అనంతపురం రూరల్



తాడిపత్రి, రాప్తాడు, శింగనమలలో అత్యధిక సమస్యాత్మక కేంద్రాలు



అనంతపురం జిల్లాలో 2,236 పోలింగ్ కేంద్రాలలో సోమవారం పోలింగ్ జరగనుంది. ఇందులో 692 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు జిల్లా అధికార యంత్రాంగం గుర్తించింది. కలెక్టరు తెలిపిన మేరకు వీటిలో అత్యధికంగా తాడిపత్రి నియోజకవర్గంలో 136, రాప్తాడులో 134, శింగనమలలో 133, రాయదుర్గంలో 30, ఉరవకొండ లో 75, గుంతకల్లులో 35, అనంతపురం అర్బన్‌లో 85, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 34 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించినట్లు కలెక్టరు వినోద్ కుమార్ వెల్లడించారు.

- అనంతపురం టౌన్

జన కేతనం 7
ఆంధ్రజ్యోతి
అనంతపురం
శ్రీ సత్యసాయి
సోమవారం 13 మే 2024

తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి గూండాగిరి..!



పీఆర్ కొట్టాలలో జరిగిన దాడిలో మహిళ చేతికి గాయం

ఏప్రిల్ 28న తోపుదుర్తి గ్రామంలో దాడిలో గాయపడిన దళిత వన్నూరప్ప

గురువారం తోపుదుర్తిలో రాజశేఖర్‌రెడ్డి అనుచరుల దాడిలో గాయపడిన రాజ్‌కుమార్



● ఈ నెల 7న కనగానపల్లి మండలం రాంపురం గ్రామంలో టీడీపీ కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి పరిటాల సునీత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి భారీ జనం రావడంతో జీర్ణించుకోలేని వైసీపీ కార్యకర్తలు మద్యం మత్తులో మిద్దెల మీద నుంచి ప్రచార రథంపై రాళ్లు రువ్వారు. మీసాలు దువ్వుతూ, తొడలు కొడుతూ, దమ్ముంటే రండిరా అని ప్రత్యర్థులను రెచ్చగొట్టారు. పోలీసులు వైసీపీ కార్యకర్తలను అడ్డుకునేందుకు వెళ్లగా మద్యం మత్తులో వారు పోలీసులపై కూడా దాడి చేసేందుకు ప్రయత్నించారు.

● కనగానపల్లి మండలం తగరకుంట గ్రామానికి చెందిన రాజ్‌కుమార్, వడ్డే మోహన్, వడ్డే శ్రీనివాసులు, వడ్డే లక్ష్మీనారాయణ, తదితరులు టీడీపీలోకి చేరేందుకు స్వగ్రామం నుంచి అనంతపురానికి వాహనంలో వెళుతుండగా తోపుదుర్తి గ్రామంలో రాజశేఖర్‌రెడ్డి అనుచరులు ఎంపీటీసీ పోతులయ్య, కుమార్‌రెడ్డి, మరి కొందరు గురువారం రాత్రి వాహనాన్ని ఆపారు. వాహనాన్ని ధ్వంసం చేశారు. రాజ్‌కుమార్, ఇతరులపై తీవ్రంగా దాడి చేశారు.

● ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి స్వగ్రామం తోపుదుర్తిలో కొందరు దళితులు, వాల్మీకులు టీడీపీలో చేరారు. అది జీర్ణించుకోలేని తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి ఏప్రిల్ 28న తన అనుచరులతో కలిసి అర్ధరాత్రి తోపుదుర్తి గ్రామంలో టీడీపీ దళిత నాయకుడు వన్నూరప్ప ఇంట్లోకి వెళ్లి తీవ్ర స్థాయిలో బెదిరించాడు. వైసీపీలో చేరాలని లేదంటే చంపేస్తామని హెచ్చరించాడు. వన్నూరప్ప నిరాకరించడంతో పిడిగుద్దులు గుద్దుతూ గ్రామంలోని ఎమ్మెల్యే ఇంటి వద్దకు తీసుకెళ్లారు. తర్వాత టీడీపీ నాయకుడు బోయ లింగమయ్య ఇంటి వద్దకు రాజశేఖర్‌రెడ్డి ఆవేశంగా వచ్చి ఉంటే వైసీపీలో ఉండాలి లేదంటే ఊరు విడిచి వెళ్లాలి. పార్టీలోకి చేరకపోతే నరికేస్తాం అని బెదిరించాడు.

టీడీపీలోకి చేరిన వారిపై దాడులు... పరిటాల సునీత ప్రచార రథంపైకి రాళ్లు... పోలీసులపైనా దాడికి యత్నం

రాప్తాడులో సవాల్‌గా మారనున్న ఎన్నికలు

రాప్తాడు

ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు రాజశేఖర్‌రెడ్డి, అతడి అనుచరులు బరితెగిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా టీడీపీ శ్రేణులపై వరుస దాడులకు పాల్పడుతున్నారు. వైసీపీ శ్రేణులు టీడీపీలోకి చేరుతుండడం జీర్ణించుకోలేక దాడులు చేస్తున్నారు. కొడకల్లారా.. ఉంటే వైసీపీలో ఉండండి లేదా ఊరు విడిచి వెళ్లిపోండి.. నరుకుతాం, చంపుతాం.. అని బెదిరిస్తూ దాడులకు తెగబడుతున్నారు. దళిత, బీసీ నాయకులపై విచక్షణా రహితంగా దాడి చేసి అడ్డు వచ్చిన వారిని కూడా గాయపరుస్తున్నారు. ఎన్నికల సమయంలో వరుస దాడులు పోలీసులకు సవాల్‌గా మారాయి. సోమవారం జరిగే ఎన్నికల్లో వైసీపీ శ్రేణులు సమస్యాత్మక గ్రామాల్లో ఇదే స్థాయిలో దాడులకు పాల్పడే అవకాశం ఉన్నట్లు సమాచారం.

● శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం పీఆర్ కొట్టాల గ్రామానికి చెందిన మాదాపురం ఎంపీటీసీ (దళితవ్యక్తి) సంపత్ వైసీపీని వీడి టీడీపీలో చేరాడు. అతడు పార్టీ మారడంతో పీఆర్ కొట్టాలలో అధికంగా ఉన్న దళిత ఓట్లు టీడీపీకి వెళతాయని ఎమ్మెల్యే సోదరుడు రాజశేఖర్‌రెడ్డి బరితెగించాడు. గత నెల 27న రాజశేఖర్‌రెడ్డి తన అనుచరుడైన నసనకోట ముత్యాలు తదితరులు 15 వాహనాల్లో పీఆర్ కొట్టాలకు వెళ్లి సంపత్, అతడి తల్లిదండ్రులపై కూడా దాడులు చేశారు. దాడిని అడ్డుకున్న దళిత మహిళ లక్ష్మక్కను వైసీపీ నాయకులు జుట్టు పట్టుకుని ఈడ్చి కొట్టారు. పోతన్నపై కట్టెలతో దాడి చేశారు. ఎంపీటీసీ సంపత్‌ను బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని ఎమ్మెల్యే వద్దకు తీసుకెళ్లి వైసీపీ కండువా కప్పారు. వైసీపీలోనే కొనసాగుతానని సంపత్‌తో బలవంతంగా చెప్పించి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.



ఈనెల 7న రాంపురంలో మీసం మెలేస్తున్న వైసీపీ శ్రేణులు

మాటతప్పిన తోపు..!

పాలబావికి రోడ్డేయలేదు
కంకర పరిచిన దారితో ప్రజల అవస్థలు
నేరవేరని తోపు ఎన్నికల హామీ

రాప్తాడు, మే 12: అధికారంలోకి వచ్చిన వెంటనే పాలబావి గ్రామానికి తారు రోడ్డు వేయిస్తానని ప్రకాష్‌రెడ్డి గత ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చి మాట తప్పారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గెలిచిన తరువాత రోడ్డు గురించి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పట్టించుకోలేదని వాపోతున్నారు. ఏళ్లు గడుస్తున్నా కంకర పరచిన దారిలో ప్రయాణం చేస్తూ అవస్థలు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న పరిటాల సునీత మరూరు నుంచి ఎం. చెర్లోపల్లి, పాలబావి మీదుగా మారెమ్మ ఆలయం వరకూ 9.2 కి.మీ తారు రోడ్డు నిర్మాణానికి రూ.4.9 కోట్లు నిధులు మంజూరు చేయించారు. భూమి పూజ చేసి పనులు కూడా ప్రారంభించా రు. కాంట్రాక్టర్ తారు రోడ్డు నిర్మాణానికి చిన్న కంకర తోలించారు. ఆ సమయంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అప్పటి ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రకాష్‌రెడ్డి పాలబావిలో పర్యటించి అధికారంలోకి రాగానే గ్రామానికి తారు రోడ్డు వేయిస్తానని బహిరంగ సభలో గ్రామస్థుల కు హామీ ఇచ్చాడు. ఎన్నికల్లో గెలిచి వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఎమ్మెల్యే సోదరులు కాంట్రాక్టర్‌ను డబ్బు డిమాండ్ చేయడంతో ఆయన పనులు నిలిపివేశారని సమాచారం. ఆ తరువాత ఎమ్మెల్యే తారు రోడ్డు నిర్మాణానికి పాత కాంట్రాక్టర్‌ను తొలగించి రీ టెండర్లు కూడా పిలవలేకపోయాడు. దీంతో మరూరు నుంచి చెర్లోపల్లి, పాలబావి మీదుగా మారెమ్మ అలయం వరకూ తారు రోడ్డు కలగానే మిగిలిపోయింది. పాలబావి గ్రామంలో దాదాపు 220 కుటుంబాలు 800కు పైగా జనాభా, 500పైగా ఓటర్లు ఉన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఐదేళ్లు అధికారంలో ఉన్నా తారు రోడ్డు వేయించలేకపోయారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డెప్పుడేస్తారో: చెంద్రాయుడు, పాలబావి



మా గ్రామానికి తారురోడ్డు ఎప్పుడు వేస్తారా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రజలు వాహనదారులు అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఎన్నికల తర్వాత వచ్చే కొత్త ప్రభుత్వమైనా దీన్ని పట్టించుకుని రోడ్డు పూర్తి చేయాలి.



ఎం. చెర్లోపల్లి నుంచి పాలబావికి కంకర పరిచిన దారి

హామీ ఇచ్చి వదిలేశారు: నరేష్, పాలబావి




గత ఎన్నికల ప్రచారంలో పాలబావికి రోడ్డేస్తామని ప్రకాష్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదు. కంకర దారిలో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి కింద పడుతున్నాయి.

తారు రోడ్డు నిర్మించాలి: రామాంజి, పాలబావి



మా గ్రామానికి తారురోడ్డు లేకపోవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంకర పరచిన దారిలోనే నాలుగేళ్ల నుంచి ప్రయాణిస్తున్నాం. వెంటనే తారురోడ్డు నిర్మించాలి

గ్రామాల్లో బెట్టింగ్ జోరు



కళ్యాణదుర్గం, మే 12: సార్వత్రిక ఎన్నికలపై గ్రామాల్లో బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. ఎన్డీయే కూటమి గెలుస్తుందని రూ. రెండు లక్షల నుంచి రూ. ఆరు లక్షల వరకు బెట్టింగ్‌లు వేసుకుంటున్నారు. దాంతో పాటు నియోజకవర్గంలో తమ పార్టీయే గెలుస్తుందని మరో వైపు బెట్టింగ్‌లు కడుతున్నారు. కళ్యాణదుర్గంలో టీడీపీ గెలుస్తుందనే బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. కళ్యాణదుర్గంటౌన్, రూరల్, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండల కేంద్రాల్లో బెట్టింగ్‌లు వేడిని పుట్టిస్తున్నా యి. ఇప్పటికే కొంతమంది బెట్టింగ్‌లు వేసుకుని జాయింట్ అకౌంట్‌ల ద్వారా బ్యాంకుల్లో డబ్బును భద్రపరచినట్లు తెలిసింది. గెలిచిన తరువాత ఆ డబ్బును పంచుకునే విధంగా ప్రణాళికలు వేసుకుని బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఈ సారి ఎక్కువగా యువత ఈ బెట్టింగ్‌లకు దిగుతున్నట్లు తెలుస్తోంది. గత రెండు రోజుల నుంచి యువత డిన్నర్లు, మందు, విందులతో పల్లె ప్రాంతాలు బిజీ బిజీగా కనిపిస్తున్నాయి. సుదూర ప్రాంతా ల్లో ఉద్యోగాలు చేసుకునే యువత కూడా ఓటేయడానికి తమ స్వగ్రామాలకు చేరుకున్నారు. కంబదూరు, కుందుర్పి మండల కేంద్రాల్లో అయితే యువత ఏకంగా ఇంటింటికి వెళ్లి టీడీపీకే ఓటు వేయాలని అర్ధరాత్రి వరకు ప్రచారాలు చేస్తున్నారు. కళ్యాణదుర్గం ఓటర్లు టీడీపీ వైపే మొగ్గు చూపుతున్నట్లు పలువురు యువకులు చెబుతున్నారు. ఈక్రమంలో కళ్యాణదుర్గం పట్టణంలో బెట్టింగ్‌ల జోరు మరింతగా పుంజుకుంటోంది. మరికొంతమంది ఓటింగ్ పూర్తయ్యాక, ఓటింగ్ సరళినిబట్టి బెట్టింగ్ వేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరి కొన్ని చోట్ల అగ్రిమెంట్లు రాసుకుని బెట్టింగ్‌లు కాస్తున్నారు.

ఇళ్లకు చేరని ఓటరు స్లిప్పులు

సచివాలయాల్లో మూలుగుతున్న 25 శాతం
అందుబాటులో లేని బీఎల్‌ఓలు

గుంతకల్లు

పట్టణంలో దాదాపు పాతిక శాతం ఓటరు స్లిప్పులు వార్డు సచివాలయాల్లో మూలుగుతున్నాయి. ఓటరు స్లిప్పులు సక్రమంగా ఓటరు ఇంటికి చేరకపోవడంతో బీఎల్వోలు రెండో శనివారం, ఆదివారాలలోనూ పంపిణీకి యత్నించారు. పట్టణంలో దాదాపు డెబ్బై ఐదు శాతం స్లిప్పులను మాత్రమే ఓటరుకు చేర్చగలిగారు. అడ్రసు ట్రేస్ కాలేదని, ఓటరు మరో వార్డులో నివసిస్తున్నాడని, ఫోన్ నెంబరు తప్పుగా ఉందన్న కారణాలతో ఓటరు స్లిప్పులను సచివాలయాలకు చేర్చారు. శని, ఆదివారాల్లో కూడా సచివాలయాలను తెరచి ఉంచి స్లిప్పుల కోసం వచ్చిన ఓటర్లకు వెతికి ఇచ్చారు. అలాగే కొన్ని సచివాలయాలు తెరవలేదు.

గుంతకల్లుటౌన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. పట్టణంలోని పొట్టిశ్రీరాముల మున్సిపల్ పాఠశాలలోని 65 పోలింగ్ కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలైనా ఓటర్ల కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. ఈ పోలింగ్ కేంద్రంలో దాదాపు 1059 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు కేవలం ఒక మహిళతో పోలింగ్ కేంద్రంలో పని చేయించారు. ఓటర్ల కోసం షామియానా, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయలేదు. పట్టణంలోని మరికొన్ని పోలింగ్ కేంద్రాలలో ఆలస్యంగా ఏర్పాట్లను చేశారు.

పామిడి: పట్టణంలోని చాలా మంది ఓటర్లకు ఓటు స్లిప్పులు అందజేయడంలో అధికారులు విఫలమయ్యారు. సోమవారం ఓటు వేయాలంటే తమ ఓటు ఏ కేంద్రంలో ఉందో తెలియక చాలా మంది ఓటర్లు పంచాయతీ కార్యాలయం, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్దకు పరుగులు తీస్తున్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. అధికారులు ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేయలేని స్థితిలో ఉన్నారా..? అని అసహనం వ్యక్తంచేస్తున్నారు.

గుత్తి: ఓటర్లకు గుత్తిపట్టణంలో ఆదివారం వరకూ కూడా కొందరికి స్లిప్పులను పంపిణీచేయలేదు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు స్లిప్పుల కోసం ఎక్కడికి వెళ్లాలో తెలియక ఆపసోపాలు పడ్డారు. ఓటరు స్లిప్‌లు అందలేదు.

మడకశిర రూరల్: ఓటరు స్లిప్పుల కోసం పలువురు ఓటర్లు బీఎల్ఓల వద్దకు పరుగులు తీస్తున్నారు. అయితే చాల మంది బీఎల్‌ఓలు అందు బాటులో లేకపోవడంతో ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్లిప్పులో ఓటరుకు తన ఓటు ఎక్కడ ఉంది, ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు, పోలింగ్ బూత్ నెంబరు తదితర వివరాలు ఉంటాయి. ఈ స్లిప్పులు అందిస్తే ఓటరుకు గందరగోళం లేకుండా సులభంగా తన ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంది. ఓటర్ స్లిప్పులను బీఎల్‌ఓలు ఓటర్ల ఇళ్ల దగ్గరికి ముందస్తుగానే వెళ్లి అందజేయాల్సి ఉంది.



గుంతకల్లులోని తిలక్‌నగర్ సచివాలయంలో మిగిలి ఉన్న ఓటరు స్లిప్పులు

స్లిప్‌ల కోసం పడిగాపులు



నేను 9వ వార్డులో నివాసముంటున్నా. సోమవారం ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్నికలకు సంబంధించి ఇంతవరకూ ఎవరూ స్లిప్‌లు ఇవ్వలేదు. ఓటర్ స్లిప్‌ల కోసం ఎవరిని అడిగినా పట్టించుకోలేదు. సచివాలయం వద్దకు వెళ్లినా అక్కడ ఎవరూ ఉండటంలేదు.

- భాగ్యమ్మ, 9వ వార్డు, గుత్తి

ఓటు వేయడానికి బెంగళూరు నుంచి వచ్చా



నేను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నా. ఓటు హక్కు వినియోగించుకునేందుకు బెంగళూరు నుంచి వచ్చా. నాది, నా భార్య ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలియని పరిస్థితి. ఓటరు స్లిప్పు కోసం పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్తే, గ్రామ సచివాలయం వద్దకు వెళ్లమన్నారు. అక్కడ తాళం వేసి ఉంది. అక్కడ అడిగితే పోలింగ్ స్టేషన్ వద్దకు వెళ్లమన్నారు. పోలింగ్ స్టేషన్ వద్ద ఎవరూ లేరు. ఓటర్లకు స్లిప్పులు సక్రమంగా పంచలేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

- అశోక్ కుమార్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, పామిడి



స్లిప్పులు ఇవ్వలేదు..



ఓటు వేయడానికి వెళ్లేందుకు బీఎల్‌ఓ మాకు ఓటరు స్లిప్‌లు ఇవ్వలేదు. ఎక్కడ ఓటు వేయాలో తెలియదు. ఇళ్ల వద్దకు బీఎల్‌ఓలు రాలేదు. చివరి రోజు వరకూ స్లిప్‌లు లేకపోతే ఎలా?

- ఆంజనేయులు, ఓటరు, గుత్తి

ఓటరు స్లిప్‌లు ఇచ్చేవారే లేరు



ఎన్నికలకు సంబంధించి ఓటర్ స్లిప్‌లు ఇచ్చే వారే దిక్కు లేదు. ఎవరిని అడిగినా అక్కడికిపో ఇక్కడికిపో అని చెబుతున్నారు తప్ప, ఎక్కడికి వెళ్లినా ఓటర్ స్లిప్ ఇచ్చే నాథుడే లేడు. ఓటరు స్లిప్పులు లేక ఇబ్బందులు పడుతున్నాము. గుత్తి ఆర్ఎస్‌లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్దకు వస్తే స్లిప్పులు ఇస్తానని బీఎల్‌ఓ తెలిపాడు. ఆయన ఎప్పుడిస్తాడో తెలియదు.

- ఖలీల్, 6వ వార్డు, గుత్తి

గ్రామాల్లో సందడి

● ఓటు వేసేందుకు స్వగ్రామాలకు భారీగా తరలివచ్చిన వలస ఓటర్లు

ఓబుళదేవరచెరువు, మే12: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వలస ఓట్లు కీలకంగా మారాయి. దీంతో పార్టీల నాయకులు వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించారు. మండల వాసులు ఎక్కువశాతం బెంగళూరుకు వలస వెళ్లారు. గత నాలుగురోజులనుంచి వారిని ప్రసన్నం చేసుకోవడానికి వివిధ పార్టీల వారు నానా తంటాలు పడుతున్నారు. వారి కోసం ప్రత్యేక వాహనాలు పంపి రప్పిస్తున్నారు. గతంలో పండుగలకు కూడా గ్రామానికి రాని ప్రజలు రాజకీయ పార్టీల ఒత్తిళ్లకు ఆదివారం గ్రామాలకు చేరుకున్నారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

గాండ్లపెంట: ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉపాధి కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లిన వారు ఆదివారం స్వగ్రామాలకు తరలివచ్చారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఓటర్లు భారీగా తరలి వచ్చారు. కర్ణాటక, హైదరాబాద్, తమిళనాడు తదితర ప్రాంతాల్లో ఉపాధి, ఉద్యోగాలు, చదువుల నిమిత్తం వెళ్లిన వారందరూ ఓటును వినియోగించుకోవడానికి తరలివచ్చారు. పండుగలకు సాధారణంగా ఒకరో ఇద్దరో వస్తారు. కానీ.. ఓటు హక్కును వినియోగించుకోవడానికి కుటుంబ సమేతంగా రావడం జరుగుతోంది. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

నల్లమాడ: మండల వాసులు ఎక్కువశాతం బెంగళూరులో ఉంటున్నారు. అయితే వారందరూ గత నాలుగురోజులనుంచి ఓటు వేయడానికి స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వలస ఓటర్ల ఓట్లు కీలకంగా మారాయి. దీంతో ఇరుపార్టీల నాయకులు వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించారు. వారి రాకపోకల చార్జీలతోపాటు, అదనంగా ఒక్కొక్కరికి రూ. రెండువేలు ఇస్తున్నట్లు సమాచారం.గతంలో పండగలకు కూడా గ్రామాలకు రాని వారు ఓటు వేయడానికి ఆసక్తిగా వస్తున్నారు. ఓటర్లలో దాదాపు 25శాతం వలస ఓటర్లు ఉన్నట్లు సమాచారం.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

● పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి
● ఆయా కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్న ఓటర్లు
● పోలీసు బందోబస్తు కట్టుదిట్టం

గాండ్లపెంట, మే 12: మండలవ్యాప్తంగా సోమవారం జరిగే పోలింగ్‌కు పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. మండలంలోని 24 పోలింగ్ కేంద్రాల్లో 21,451 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 10,589మంది పురుషులు, 10,860మంది మహిళలు, ఇద్దరు ఇతరులు ఉన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సౌకర్యంగా ఉండేందుకు నీడ, నీరు, మరుగుదొడ్లు, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఉదయం 7గంటల నుంచే ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఓబుళదేవరచెరువు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. మండలంలో 39,155మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 19,311మంది పురుషులు, 19,843మంది మహిళలు, ఇతరులు ఒకరు ఉన్నారు. వారు 44 పోలింగ్ కేంద్రాల్లో ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

ముదిగుబ్బ: మండలవ్యాప్తంగా 61 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు చేశారు. మండలంలో 45,976 మంది ఓటర్లు ఉండగా వారిలో మహిళలు 23,083 మంది, పురుషులు 22,893 మంది ఉన్నారు. ఓటర్లు తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని సీఐ యతీంద్ర తెలిపారు. ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రమే సామగ్రితో ఆయా కేంద్రాలకు చేరుకున్నారు.

తాడిమర్రి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండలంలో 32 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. దాదాపు 480 మంది సిబ్బంది ఎన్నికల విధులలో పాల్గొంటున్నారు. కాగా మండలంలోని చిల్లవారిపల్లి, పెద్దకోట్ల, ఏకపాదంపల్లి గ్రామాలలో ప్రత్యేక బలగాలతో పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

బత్తలపల్లి: మండలవ్యాప్తంగా 42 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలకేంద్రంలో ఎక్కువగా 8 కేంద్రా లు ఏర్పాటు చేశారు. ఓటర్లు ఆయా కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రమే సామగ్రితో ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అయితే అక్కడ సరైన వసతులు లేక ఇబ్బంది పడ్డారు.

నల్లమాడ: మండలవ్యాప్తంగా 39 పోలింగ్ కేంద్రాల ను ఏర్పాటు చేశారు. వాటిల్లో 33,582మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 16,687 మంది పు రుషులు, 16,694మంది మహిళలు, ఇతరులు ఒకరు ఉన్నారు.




గాండ్లపెంట, ఓడీసీలోని పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు ఏర్పాటు చేసిన దృశ్యం

ఓటు కోసం..

● తరలివచ్చిన వలస ఓటర్లు
● భారీ పోలింగ్‌కు అవకాశం
● ప్రజాసేవకుడికి, వ్యాపారికి మధ్యనే ప్రధాన పోటీ
● ప్రజలకు అందుబాటులో ఉండేవారికే విజయావకాశాలు

కదిరి, మే 12: సార్వత్రిక ఎన్నికలకు సోమవారం పోలింగ్ జరగనుంది. ఓటు వేసేందుకు ఓటర్లు సిద్ధమయ్యారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు ఇప్పటికే తమ గ్రామాలకు చేరుకున్నారు. వలస ఓటర్లు కూడా సొంత గ్రామాలకు, పట్టణాలకు చేరుకుని ఓటు వేసేందుకు సిద్ధమయ్యారు. పోస్టల్ బ్యాలెట్‌లో నమోదైన విధంగానే సార్వత్రిక ఎన్నికల్లో కూడా భారీ పోలింగ్‌కు అవకాశమున్నట్లు కనిపిస్తోంది. దీనికి కారణం ప్రభుత్వ వ్యతిరేకతేనని, తమ ఓటుతో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నట్లు పలువురు ఓటర్లు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కూటమి టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌కు, వైసీపీ అభ్యర్థి మగ్బూల్‌అహ్మద్‌కు ప్రధాన పోటీ ఉండనున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. మొత్తం మీద ఈసారి ఎన్నిక రసవత్తరంగా మారింది. ప్రజలు నిత్యం అందుబాటులో ఉండి ప్రజా సేవ చేసేవారికి అవకాశమిస్తారో, రెడీమేడ్‌గా మూడునెలకే ఎన్నికల కోసం వచ్చిన అభ్యర్థులకు పట్టం కడతారో వేచి చూడాల్సిందే.

తరలి వచ్చిన వలస ఓటర్లు ..

కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 20వేలమంది ఓటర్లు ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం బయట ప్రాంతాల్లో ఉన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు సోమవారం జరుగుతుండడంతో వారందరూ ఓటు వేసేందుకు పెద్దఎత్తున తమ స్వగ్రామాకు తరలి వచ్చారు. ప్రధాన పార్టీల నాయకులు, వారి అనుచరులు వలస ఓటర్లను రప్పించడానికి వివిధ రకాల ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే అనేక గ్రామాలు, పట్టణాలకు వలస ఓటర్లు చేరుకున్నారు. మిగిలిన వారు కూడా అప్పుడో.. ఇప్పుడో చేరుకోనున్నట్లు సమాచారం. ఎన్నడూ లేని విధంగా ఈ సారి వలస ఓటర్లు ఓటు వేసేందుకు భారీగా తరలివస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.

భారీ పోలింగ్‌కు అవకాశం

నేడు జరిగే ఎన్నికల్లో భారీ పోలింగ్‌కు అవకాశమున్నట్లు కనిపిస్తోంది. పోస్టల్ బ్యాలెట్‌లో జిల్లాలోనే అత్యధికంగా మూడువేలకుపైగా ఓట్లు పోలయ్యాయి. ఈ పోలింగ్‌లో కూడా పెద్ద ఎత్తున ఓటర్లు ఓటును ఉపయోగించుకునే అవకాశముంది. ముఖ్యంగా వలస ఓటర్లతోపాటు మొదటిసారిగా ఓటు వేసేవారు కూడా అధికంగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో దాదాపు 79 శాతం ఓటింగ్ నమోదైంది. ఈమారు 80నుంచి 85 శాతానికి పైగా పోలింగ్ జరిగే అవకాశం కనిపిస్తోంది.

ప్రభుత్వంపై వ్యతిరేకతే కారణమా?

ఈసారి పోలింగ్‌లో యువత, విద్యార్థులు అధికంగా పాల్గొనే అవకాశముంది. దీనికి కారణం ప్రభుత్వంపై వ్యతిరేకతేనని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఐదేళ్లపాటు డీఎస్సీ ఇవ్వకపోవడం, ఇతర ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం, విద్యాదీవెన, వసతి దీవెన రాకపోవడంతో పలువురు విద్యార్థులు వారి సొంత ఖర్చుతో చదువుకోవడం లాంటి అంశాలు ఈఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపనున్నట్లు సర్వేల్లో తేలింది. దీంతో పాటు ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలపై పన్నులభారం ప్రధాన కారణమవుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ ఆగ్రహాన్ని పోస్టల్ బ్యాలెట్ ద్వారా చూపినట్లు నిపుణులు చెబుతున్నారు. ఇదే తీరు నేడు జరిగే పోలింగ్‌లో కూడా జరుగుతుందని పలురువు భావిస్తున్నారు.

వారి మధ్యే పోటీ..

20 ఏళ్ల పాటు రాజకీయాల్లో ఉంటూ ఓడినా.. గెలిచినా.. నిత్యం నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తున్న కూటమి టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌కు, మూడునెలల ముందు వరకు బెంగళూరులో వ్యాపారం చేసుకుంటూ.. ఎన్నికలప్పుడు వచ్చిన మగ్బూల్ అహమ్మద్‌కు మధ్యనే పోటీ ఉంటోందని ప్రజలు భావిస్తున్నారు. ఇతర పార్టీలైన కాంగ్రెస్, బీఎస్పీ, నామమాత్రమేనని అంటున్నారు. కాంగ్రెస్‌కు మైనార్టీ అభ్యర్థి షాన్వాజ్ పోటీలో ఉండడం వలన వైసీపీకి కొంతమేర ఓటు శాతం తగ్గుతుందని ప్రజలంటున్నారు. మొత్తం మీద ప్రజా సేవకుడికి, వ్యాపారికి మధ్యనే తీవ్ర పోటీ ఉంటుందని, ఈపోటీల్లో కదిరి ప్రజలు విజ్ఞతగా ఓటు వేసి తమకు అందుబాటులో ఉండేవారినే ఎన్నుకోనున్నారని నిపుణులు భావిస్తున్నారు.

281 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

కదిరి, మే 12: కదిరి నియోజకవర్గంలో ఆరు మండలాలకు గాను 281 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో ఓటర్లు 2, 53,420మంది ఉన్నారు. వీరిలో 1,24,640మంది పురుషులు, 2,28,762మంది మహిళలు, ఇతరులు 8మంది ఉన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 46 ఉన్నాయి. వెబ్‌క్యాస్టింగ్ ద్వారా నిఘా ఉంచే పోలింగ్‌కేంద్రాలు 259 ఉన్నాయి. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు కుర్లి, తలుపుల, పెద్దన్నవారిపల్లి, పొలతలవాండ్లపల్లి, పట్నం, ఎర్రదొడ్డి, కుటాగుళ్ల, కదిరి మున్సిపాలిటీ, సున్నపుగుట్ట తండా, కుమ్మరవాండ్లపల్లి, గాండ్లపెంట, జౌకల, మరికొమ్మెదిన్నె, గూటిబైలు, ఎదురుదొన్న, నల్లచెరువు, ఎర్రగుట్టపల్లి, మాడిశెట్టిపల్లి, రాచినేపల్లి, కొక్కంటి, డి. చెక్కవారిపల్లి, బాలసముద్రం, టి.సదుం ఉన్నాయి. వీటిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు అధికారులు తెలిపారు.

అసౌకర్యాల నడుమ పోలింగ్ కేంద్రం

గాండ్లపెంట, మే 12: మండలంలోని కటారుపల్లి పంచాయతీలోని ద్వారనాల పోలింగ్ కేంద్రంలో అసౌకర్యాలు నెలకొన్నట్లు ప్రజలు వాపోతున్నారు. పోలింగ్ సోమవారం జరగనుందని, దీంతో అక్కడ సౌకర్యాలు సరిగా లేకపోతే ఇబ్బందులు తలెత్తుతాయని అంటున్నారు. ముఖ్యంగా ఆ పోలింగ్ కేంద్రంలో ఒక విద్యుత్ బల్బు మాత్రమే ఉందని, చుట్టూ ఎలాంటి లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో చీకటి నెలకొందని చెబుతున్నారు. అదీగాక పోలింగ్ కేంద్రం ఊరి చివరి ఉందని, విషపురుగుల సంచారం ఎక్కువగా ఉంటుందని తెలుపుతున్నారు. ఒక్కరోజు జరిగే పోలింగ్‌కు కూడా విద్యుత్ సౌకర్యం కల్పించలేరాని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



ద్వారనాల పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేయని విద్యుత్ లైట్లు

టీడీపీలోకి వైసీపీ నాయకుల చేరిక

కొత్తచెరువు, మే 12: మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రామసుబ్బారెడ్డి, గాండ్లభైరవుడు టీడీపీలోకి చేరారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి సమక్షంలో చేరారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల,పట్టణ కన్వీనర్లు రామకృష్ణ, ఒలిపిశీన, శ్రీనివాసులు, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, సుమలత, నాగేంద్ర, చంద్ర పాల్గొన్నారు.



టీడీపీలోకి చేరిన వారితో పల్లె

జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ కూడా..

ఓబుళదేవరచెరువు: జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్, వైసీపీ నాయకుడు జౌలి బాబా టీడీపీలోకి చేరారు. మండలకేంద్రంలో ఆయన జడ్పీటీసీ మాజీ సభ్యుడు పిట్టా ఓబులరెడ్డి సమక్షంలో జౌలి బాబాతో పాటు మరో పదికుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. వారికి పిట్టా ఓబులరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల మహబూబ్‌బాషా, నరసింహబాబు, చాంద్‌బాషా, పిట్టా ప్రభాకర్‌రెడ్డి, పిట్టా రాజారెడ్డి, వెంకటరంగారెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు విఘాతం కలిగిస్తే చర్యలు: ఎస్ఐ

బత్తలపల్లి, మే 12: మండలవ్యాప్తంగా జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఎస్ఐ తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ పార్టీ నాయకుల నాయకులు, ప్రజలు అందరూ కలిసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని కోరారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులుగా ఉండరాదన్నారు. మండలవ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది




ధర్మవరం, కదిరిలో ఎన్నికల సామగ్రి కోసం వేచివున్న పీఓ, ఏపీఓలు

ధర్మవరం, మే 12: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. నియోజకవర్గంలో 290 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం పోలింగ్ జరగనుంది. ఇందు కోసం సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన సిబ్బంది స్థానిక మార్కెట్‌యార్డులో ఆర్ఓ వెంకటశివరామిరెడ్డి, ఎన్నికల అధికారులు ఏర్పాటుచేసిన కౌంటర్‌ల వద్దకు హాజరై ఈవీఎం,వీవీప్యాట్‌లు, ఇతర ఎలక్షన్ మెటీరియల్ అందుకున్నారు. అనంతరం పోలింగ్ ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్‌ప్రిసైడింగ్ అధికారులు కేంద్రాలకు కావాలసిన సరంజామాను తీసుకుని పరిశీలించారు. ఎన్నికల అబ్జర్వర్ రామచంద్ర తివారీ, రిటర్నింగ్ అధికారి వెంకటశివరామిరెడ్డి ఎన్నికల నిర్వహణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. అన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు తరలివెళ్లారు. 50 మంది పీఓలు, 50 మంది ఏపీఓలు, 200 రిజర్వుడు పీఓలు, 45 మంది మైక్రోఅబ్జర్వర్లు , 35 మంది సెక్టార్ ఆఫీసర్లు, 35 మంది రూట్ ఆఫీసర్లను నియమించామని ఆర్వో తెలిపారు. ఎన్నికల సిబ్బందిని తరలించడానికి 92 వాహనాలను ఏర్పాటుచేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.

కదిరిఅర్బన్: కదిరి నియోజకవర్గంలో జరగనున్న పోలింగ్‌కు ఎన్నికల సిబ్బంది కదిరి పట్టణం నుంచి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో తరలివెళ్లారు. నియోజకవర్గవ్యాప్తంగా 281 పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించడానికి మూడువేల మంది సిబ్బందిని కేటాయించారు. దీంతో ఎన్నికల సిబ్బంది ఆదివారం ఉదయం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానానికి చేరుకున్నారు. వారికి అక్కడ పోలింగ్ సామగ్రితో పాటు, ఈవీఎంలు, వీవీప్యాడ్లు, కంట్రోల్‌యూనిట్లు అందించారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి పీఓ, ఏపీఓ, ఓపీఓలతో పాటు వెబ్‌కాస్టింగ్ సిబ్బందిని కేటాయించారు. ఎన్నికల అబ్జర్వర్ అన్బుకుమార్, రిటర్నింగ్ అధికారి సన్నీ వంశీకృష్ణ, పోలింగ్ ఏర్పాట్లును పర్యవేక్షించడంతో పాటు ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు.



ధర్మవరంలో పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి సిద్ధంగా ఉంచిన ఈవీఎంలు



కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు
ధర్మవరం, కదిరి నుంచి ఈవీఎంలను తీసుకెళ్తున్న పీఓలు, ఏపీఓలు

నేలకొరిగిన విద్యుత్ స్తంభం

● త్రుటిలో తప్పిన ప్రమాదం

నల్లమాడ, మే 12: మండలంలోని చౌటకుంటపల్లిలో శిథిలావస్థకు చేరి ఉన్న విద్యుత్ స్తంభం కొద్దిపాటి గాలికే నేలకొరిగింది. గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని చేనేత కాలనీలో ఆదివారం విద్యుత్ స్తంభం కొద్దిపాటి గాలి వీచడంతోనే తీగలతో సహా నేలకొరింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రామస్తులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించగా, విద్యుత్ సరఫరాను తొలగించారు. స్తంభం శిథిలావస్థకు చేరడంతో మార్చాలని గతంలో పలు మార్లు విద్యుత్ అధికారులకు విన్నవించామని, ఫలితం లేకపోయిందని పలువురు తెలిపారు. జరగరానిది ఏదైనా జరిగి ఉంటే ఎవరు బాధ్యతలని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్‌స్తంభాలను మార్చాలని వారు కోరారు.



చౌటకుంటపల్లి నేలకొరిగిన విద్యుత్ స్తంభం

సీసీతో సమావేశమైన వసుంధరాదేవి



మాజీ ఎమ్మెల్యే సీసీ వెంకటరాముడుతో మాట్లాడుతున్న వసుంధరాదేవి

హిందూపురం, మే 12: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే సీసీ వెంకటరాముడును నందమూరి వసుంధరదేవి ఆదివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీసీ ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. ఇటీవల నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించిన తీరు, ప్రజల నుంచి వచ్చిన స్పందనపై సీసీకి తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి హిందూపురం నియోజకవర్గంలో పార్టీని ఏకతాటిపై నడిపించిన నాయకుడు సీసీ అన్నారు. ఇదే విషయాన్ని బాలకృష్ణ పలు సార్లు చర్చించారన్నారు. అంతేకాకుండా ఎన్టీఆర్ హయాంలో సీసీ వెంకటరాముడు పార్టీలో కీలకంగా వ్యవహరించడంతోపాటు ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో నియోజకవర్గం అభివృద్ధి కోసం పూర్తిస్థాయిలో పనిచేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకు టలు నెట్టప్ప, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్త ఆత్మహత్యాయత్నంపై అధికారులకు నివేదిక

గోరంట్ల, మే 12: పట్టణంలోని రెండో వార్డు ఆశా కార్యకర్త శబరి ఆత్మహత్యాయత్నం ఘటనపై డీఎం అండ్‌హెచ్‌ఓకు నివేదిక పంపినట్లు డాక్టర్ శ్రుతి తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి ఈ నెల 7న తనపై నింద మోపుతూ అందరి ఎదుట తీవ్రవస్థాయిలో మందలించిందని, అందుకు విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆశాకార్యకర్త శబరి తెలిపిన విషయం తెలిసిందే. ఆమె గోరంట్లలో చికిత్స అనంతరం హిందూపురం ఆసుపత్రిలో చికిత్స పొంది వచ్చారు. ఈ విషయంలో డాక్టర్ శ్రుతి ఇద్దరిని మందలించి రాజీ చేసే ప్రయత్నం చేశారు. క్షమాపణ చెప్పడానికి ఎంఎల్‌ఎల్‌హెచ్‌పీ గౌతమి నిరాకరించడంతో డాక్టర్ శ్రుతి ఇద్దరికి నోటీసులు జారీ చేసి, వారి సంజాయిషీ మేరకు తన విచారణ నివేదికను డీఎంహెచ్‌ఓకు పంపారు.

గ్రామాల్లో కర్ణాటక మద్యం జోరు

మడకశిర రూరల్, మే 12: సార్వత్రిక ఎన్నిల నేపథ్యంలో నియోజకవర్గంలో మద్యం, కల్లు దుకాణాలు మూసివేశారు. అయినా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. ఆంధ్రాలో మద్యం దుకాణాలను మూసివేయడంతో కర్ణాటక మద్యానికి భాగా డిమాండ్ పెరిగింది. కర్ణాటక నుంచి అక్రమంగా జిల్లాలోకి తస్తోంది. అయితే నిఘా విభాగం అధికారులు పట్టుకోలేక పోతున్నారన్న విమర్శలు ప్రజల నుంచి వస్తున్నాయి. ఎన్నికల సమయంలో కొంత మంది కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తీసుకొచ్చి, దానిని అమ్మి బాగా సొమ్ముచేసుకుంటున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆంధ్రాలో మద్యం దుకాణాలు బంద్ కావడంతో సరిహద్దు గ్రామాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. వైసీపీ నాయకులు కొన్ని గ్రామాల్లో నగదుతో పాటు మద్యం పంపిణీ చేస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రశాంతమైన గ్రామాల్లో మద్యం తాగిన వారు గొడవలకు కారణమౌతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారలు అక్రమ మద్యంపై గట్టి నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

కనీస వసతులు లేని పోలింగ్ కేంద్రం



సౌకర్యాలు లేని అక్కంపల్లి పోలింగ్ కేంద్రం

మడకశిర రూరల్, మే 12: ఎన్నికల నియమావళి ప్రకారం ఓటువేయడానికి వచ్చే ఓటర్లకు, అక్కడ పనిచేసే సిబ్బందికి పోలింగ్ కేంద్రం వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలి. తాగునీరు, నీడ, విద్యుత్ సౌకర్యాలు, మరుగుదొడ్డు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ఎన్నికల సంఘం ఆదేశాలు ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని అక్కంపల్లి పోలింగ్ బూత్ (నెంబర్ 197) పరిధిలో 714 మంది ఓటర్లు ఉన్నారు. ఈ బూత్‌లో ఏడుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో పోలింగ్ బూత్ సమీపంలో ఉన్న ఇళ్ల వద్దకు వెళ్తున్నారు. అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలు వాపోతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



వినోద్ (ఫైల్)

రొద్దం, మే 12 : మండలపరిధిలోని పి కొత్తపల్లికి చెందిన పాల నాగప్ప కుమారుడు వినోద్(32) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. వినోద్ ఆదివారం ఉదయం పీ కొత్తపల్లిలో తన ఇంటి వద్ద నీటి గుంతలో నుంచి నీరు తోడేందుకు విద్యుత్ మోటార్ ఆన్ చేశాడు. అప్పటికే మోటార్‌కు విద్యుత్ సరఫరా అవుతుండడంతో వినోద్ విద్యుదాఘాతానికి గురైనట్లు బంధువులు తెలిపారు. వెంటనే బంధువులు మోటారుకు విద్యుత్ సరఫరాను నిలిపివేసి రొద్దంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అప్పటికే అతడు మృతిచెందాడని బంధువులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వలీబాషా ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దరాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య శకుంతల, రెండేళ్ల చిన్నారి ఉన్నారు.

చెత్తకుప్పలో శిశువు మృతదేహం

మడకశిర టౌన్, మే 12: పట్టణంలోని శివాపురం వద్ద ఆదివారం చెత్తకుప్పలో ఓ ఆడ శిశువు మృతదేహం పడిఉంది. ఉదయం అటు వైపు వెళుతున్న స్థానికులకు ఆడ శిశువు మృతదేహం కన్పించడంతో పోలీసులకు సమాచారం అందించారు. జంతువులు శిశువు, దేహాన్ని, తలను వేరు చేశాయి. ఈ ఘటన స్థానికులను కలచివేసింది. ఆ శిశువు వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

పారదర్శకంగా పోలింగ్‌కు ఏర్పాట్లు

పురంలో 192 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ టెలికాస్ట్



హిందూపురంలో ఎన్నికల విధులకు హాజరైన సిబ్బంది



వీవీ ప్యాట్‌తో కదిలిన యంత్రాంగం



సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా బస్సులు

హిందూపురం అర్బన్, మే 12: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరుగనున్న పోలింగ్ పారదర్శకంగా ఉండేలా చర్యలు చేపట్టినట్లు, సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల డీటీ రెడ్డి శేఖర్ తెలిపారు. పట్టణంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాలలో ఆదివారం పో లింగ్ సిబ్బందికి ఈవీఎంలు అందించారు. హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా 32 సెక్టార్‌లలో 253 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 192 కేంద్రాల్లో వెబ్ టెలికాస్ట్‌కు ఏర్పాటుకు రూపుదిద్దుకుంది. ఈ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుని సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు. మొత్తం 44 రూట్‌లలో 253 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. ఇందుకు గాను 253 మంది పోలింగ్ అధికారులు, 253 మంది అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, 1012 మంది ఓపీఓలను నియమించారు. వారితో పాటు ప్రతి కేంద్రానికి పోలీస్ సిబ్బంది అదనంగా ఎన్నికల సిబ్బందికి ప్రొటెక్షన్‌గా వెళ్లారు. సిబ్బందికి, ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా గట్టి పో లీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందించారు. ఎన్నిల విధులకు హాజరయ్యే సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు.

ఎన్నికలు సవ్యంగా సాగాలి : ఎస్పీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

హిందూపురం అర్బన్ నియోకవర్గంలో ఎన్నికలు సజావుగా జరగాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. హిందూపురం నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లను ఎస్పీ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, స్ట్రాంగ్ రూంలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ భద్రత, ఎన్నికల విధులకు వెళ్లే వారికి రవాణ సౌకర్యాలు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు, పోలింగ్ అధి కారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని డీఎస్పీ కన్హక్‌కు సూచించారు.

పోలింగ్‌కు 241 కేంద్రాలు



ఎన్నికల విధులకు వెళ్లేందుకు మడకశిరలో సిద్ధంగా ఉన్న సిబ్బంది

మడకశిర, మే 12: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 2,10,804 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషలు 1,06, 242 మంది, మహిళలు 1,04, 831 మంది ఉన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్‌కు సోమవారం జరుగనున్న ఎన్నికల్లో వారు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అమరాపురం మండలంలో 46,919 మంది, గుడిబండలో 43,160 మంది, రొళ్ల మండలంలో 30,677 మంది, అగళిలో 26,682 మంది, మడకశిర రూరల్ పరిధిలో 46,432 మంది, మడకశిర అర్బన్ పరిధిలో 17,204 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో అమరాపురం మండలంలో పురుషలు 23,530, మహిళలు 23,389 మంది, గుడిబండలో పురుషలు 21,809, మహిళలు 21,351 మంది, రొళ్లలో పురుషలు 15,660, మహిళలు 15017 మంది, అగళిలో పురుషలు 13,463, మహిళలు 13,219 మంది, మడకశిర రూరల్ లో పురుషలు 23,357, మహిళలు 23,074 మంది, మడకశిర అర్బన్ పరిధిలో పురుషలు 8,423, మహిళలు 8,781 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నియోజకవర్గంలో మొత్తం 241 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో సమస్య లేని పోలింగ్ కేంద్రాలు 195 , సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 42, వెబ్ కాస్టింగ్ ద్వారా నిఘా ఉన్న పోలింగ్ కేంద్రాలు 147 దాకా ఉన్నాయి.

మడకశిర టౌన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మడకశిర డిగ్రీ కళాశాల అవరణంలో ఆదివారం ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందించారు. మడకశిర నియోజకవర్గంలో అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల పరిధిలో 241 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఓ గౌరీశంకర్ తెలిపారు. పీఓలు ఏపీఓలు కలిపి 1446 మంది సిబ్బందిని నియమించామని, 20 శాతం సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచామన్నారు. ఒక డీఎస్పీ, సీఐ, పది మంది ఎస్‌ఐలు, మొత్తం 450 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు సీఐ మనోహర్ తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు వివరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సిబ్బందికి ఈవీ ఎంలు, ఎన్నికల సామాగ్రిని అందజేశారు. పోలింగ్ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. పోలింగ్‌కు తరలివెళ్లే సిబ్బందికి బస్సుల సౌకర్యం కల్పించారు.

గుడిబండ: సార్వత్రిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండలంలో 47 పోలింగ్ కేంద్రాల్లో 42,954మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

వైసీపీ చీప్ ట్రిక్స్

- మాజీ ఎమ్మెల్సీ పేరుతో ఫేక్ లెటర్
- చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇక్బాల్ ఫిర్యాదు



ఇక్బాల్ పేరుమీద సృష్టించిన ఫేక్ లెటర్ ఇదే



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఇక్బాల్

హిందూపురం, మే 12: పోలింగ్‌కు ఒక్కరోజు ముందు హిందూపురంలో అధికార పార్టీ నాయకులు చీప్ ట్రిక్స్‌కు తెరలేపారు. మాజీ ఐపీఎస్ అధికారి, మాజీ ఎమ్మెల్సీ అయిన షేక్ మహ్మద్ ఇక్బాల్ తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఓ ఫేక్ లెటర్‌ను సృష్టించి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. హిందూపురం నియోజకవర్గంలోని పలు వాట్సప్‌గ్రూపుల్లో ఆదివారం ఇక్బాల్‌పేరుతో బహిరంగ లేఖ అంటూ పంపారు. గతనెల 5న ఇక్బాల్ ఎమ్మెల్సీ పదవికి, వైసీపీకి రాజీనామా చేసి, అదేనెల 9వ తేదీన టీడీపీలో చేరారు. అయితే ఆయన టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు లేఖలో సృష్టిం చారు. ఈ లేఖ ఎమ్మెల్సీ పేరుతో ఉంది. ఆయన ప్రస్తుతం మాజీ ఎమ్మెల్సీగా ఉన్నా ఎమ్మెల్సీగా ఫేక్ లెటర్ సృష్టించడంపై మండిపడ్డారు. ఈ లేఖలో టీడీపీ, జనసేన, బీజేపీలు కలిసి పెట్టుకున్న అనైతిక పొత్తుతో నేను భాగం కాలేక పోతున్నానని చెప్పడం విశేషం. దీనిపై ఇక్బాల్ ఆదివారం హిందూపురం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన పేరుతో ఫేక్ లెటర్ సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఇక్బాల్ విలేకరులతో మాట్లాడుతూ ఓడిపోయే నాయకులు చేసిన పని ఇదని, తాను ఇప్పుడు మాజీ ఎమ్మెల్సీ అయినా ఎమ్మెల్సీ లెటర్‌ప్యాడ్ సృష్టించడం చట్టవిరుద్ధమ న్నారు. ఈఫేక్ లెటర్‌ను సృష్టించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఇక్బాల్ డిమాండ్ చేశారు.

ఎంజీఎం హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

హిందూపురం అర్బన్, మే 12: పట్టణ పరిధిలోని మహాత్మాగాంధి మునిసిపల్ పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యానికి కలెక్టర్ అరుణ్‌బాబు ఆదివారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పాఠశాలలో నాలుగు గదులు, 120 టేబుళ్లు అవసరముందనీ, వాటిని సమకూర్చాలని కలెక్టర్.. తహసీల్దార్‌కు తెలిపారు. వీఆర్‌ఓ సుభాషిణి ద్వారా హెచ్‌ఎంకు తెలియజేశారు. పాఠశాల గదులకు తాళాలు వేశామనీ, అందులో విలువైన టీవీలు ఉండడంతో గదులు ఇవ్వలేమని హెచ్‌ఎం తెలిపినట్లు సమాచారం. గదులు ఇవ్వాలంటే అనుమతి లెటర్ కావాలని హెచ్‌ఎం.. వీఆర్‌ఓకు తెలిపారు. ఇదే విషయాన్ని వీఆర్‌ఓ.. ఆర్‌ఐ అమరేంద్రకు తెలపగా.. ఆయన కలెక్టర్‌కు తెలిపారు. దీంతో కలెక్టర్ గదులు, టేబుళ్లు ఏర్పాటు చేయాలని మునిసిపల్ కమిషనర్‌కు లేఖ రాశారు. ఆ లేఖను హెచ్‌ఎంకు ఇవ్వగా.. ఇది కమిషనర్‌కు రాశారు. ఆయన వద్దకే వెళ్లాలని తెగేసి చెప్పారు. చేసేదిలేక దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఎన్నికల విధులకు ఎందుకు సహకరించడంలేదో తెలపాలని నోటీసు ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఎందుకొచ్చిన గొడవ అని ఆమె గదులు, 120 టేబుళ్లను అప్పటించారు. ఈ విషయంపై ఎన్నికల అనంతరం సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుందనీ, విచారణ కూడా జరగవచ్చని తహసీల్దార్, సిబ్బంది మాట్లాడుకోవడం గమనార్హం.

ఆలయం, దర్గాను సందర్శించిన పరిటాల సునీత



బాబయ్య దర్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న పరిటాల సునీత

పెనుకొండ, మే 12 : ఎన్నికల ప్రచారం ముగియడంతో... మాజీ మంత్రి పరిటాల సునీత ఓ వైపు పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ మరోవైపు దైవదర్శనాలతో బిజీ బిజీగా గడిపారు. ఆమె ఆదివారం పెనుకొండ సమీపంలోని గేటు ఆంజనేయస్వామి ఆలయాన్ని, పెనుకొండ బాబయ్యస్వామి దర్గాను దర్శించుకుని ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. పెనుకొండ నియోజకవర్గంలో ఉన్నప్పుడు ఆమె ప్రతి ఎన్నికల సమయంలో ఇలా దర్గాతో పాటు ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. రాప్తాడు నియోజకవర్గం ప్రజలకు ఈ ఎన్నికల ద్వారా మంచి జరగాలని కోరుకున్నట్లు తెలిపారు.

పింక్ పోలింగ్ కేంద్రం పరిశీలన

గోరంట్ల, మే 12: పట్టణంలోని బాలికోన్నతపాఠశాలలో మహిళలకోసం ఏర్పాటుచేసిన పింక్ పోలింగ్ కేంద్రాన్ని పెనుకొండ సబ్‌కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అపూర్వ భరత్ ఆదివారం పరిశీలించారు. సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు గోరంట్లలోని 245వ పోలింగ్ కేంద్రాన్ని ప్రజలను ఆకర్షించేలా సఖి పోలింగ్ కేంద్రం పేరుతో వినూత్నరీతిలో అధికారులు తీర్చిదిద్దారు. ఈవిషయాన్ని హంగులు, రంగులతో పోలింగ్ కేంద్రం అనే శీర్షికతో ఆదివారం ఆంధ్ర జ్యోతిలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. పింక్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్వో ప్రశంసించారు.

యథేచ్ఛగా వైసీపీ డబ్బు పంపిణీ



ఓటర్లకు డబ్బు పంపిణీ చేస్తున్న వైసీపీ నాయకుడు, డబ్బు కోసం వైసీపీ నాయకుడి ఇంటివద్ద గుమిగూడిన జనం

హిందూపురం, మే 12 : తమ పార్టీపై ఉన్న వ్యతిరేకతను ఎంతో కొంత తగ్గించుకుని, ఎలాగైనా ఎన్నికల్లో ఓట్లు సాధించాలన్న లక్ష్యంతో అధికార పార్టీనాయకులు ఓటుకు రూ.2వేలు చొప్పున పంపిణీ చేశారు. వైసీపీ నాయకులు ఆదివారం సాయంత్రం తమ ఇళ్లవద్దకు ఓటర్లను పిలిపించుకుని రూ.2వేలు చొప్పున అందజేశారు. రూరల్ మండలానికి చెందిన ఓ నాయకుడు దర్జాగా ఓటుకు రూ.2వేలు చొప్పున పంపిణీ చేశారు. ఓటర్లను వైసీపీ నాయకులు ఇళ్ల వద్దేకే పిలిపించుకున్నారు. అయితే ఓటుకు రూ.2వేలు చెప్పి తీరా రూ.వెయ్యి అందించారని మండిపడ్డారు.

రాయిని ఢీకొన్న కారు

ఇద్దరు ఉపాధ్యాయుల మృతి

మరో ఇద్దరికి గాయాలు



ధనుంజయ, శ్రీకృష్ణ (ఫైల్)

పావగడ, మే 12: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనుమపల్లి గేటువద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకృష్ణ(56), ధనుంజయ(57)అనే ఇద్దరు ఉపాధ్యాయులు మృతిచెందగా వెంకటాచలపతి, ఆర్‌ఎం నరసింహయ్య అనే ఇద్దరు ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. పావ గడ తాలూకాలోని గౌడేటి పాఠశాలలో పనిచేస్తున్న శ్రీకృష్ణ, పావగడ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ధనుంజయ, బూవికాలనీలో పనిచేస్తున్న వెంకటాచలపతి, రాజవంతిలో పనిచేస్తున్న నరసింహయ్య కలిసి శనివారం రాత్రి తమకు తెలిసిన వారింటో శుభకార్యానికి కారులో తుమకూరుకు బయలుదే రారు. శుభకార్యం ముగించుకుని శనివారం రాత్రి తిరిగి వస్తున్నారు. పావగడ సమీపం లో కనుమపల్లి గేటు వద్ద రాత్రి 2గంటల సమయంలో ఎదురుగా వస్తున్న వాహ నాల లైటింగ్‌కు డ్రైవింగ్ చేస్తున్న శ్రీకృష్ణ కళ్లుచెమిరి స్టీరింగ్ పక్కకు లాగింది. దీంతో పక్కనే ఉన్న రాయిని కారు ఢీకొం ది. ఈ ప్రమాదంలో శ్రీకృష్ణ, ధనుంజయ అక్కడికక్కడే మృతిచెందగా వెంకటాచలపతి, నరసింహయ్య తీవ్రగాయాలపాలయ్యారు. అటుగా ఆదివారం తెల్లవారుజామున 4గంటల సమయంలో వెళ్తున్న పాలవ్యాన్ డ్రైవర్లు ఇది గమనించి పోలీసులకు, 108కు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిన వారిని పావగడ ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ సభ్యులు, విద్యార్థుల్లో తీవ్ర విషాదం

ఉపాధ్యాయులు ధనుంజయ, శ్రీకృష్ణ విగతజీవులుగా పడి ఉండటంతో పెద్దదిక్కును కోల్పోయిన ఆ కుటుంబాల సభ్యుల్లో, వారి వద్ద చదువుకున్న విద్యార్థుల్లో తీవ్ర విషాదం నెలకొంది. మృతదేహాలను పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేసినట్లు సీఐ సురేష్ తెలిపారు. ధనుంజయకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. శ్రీకృష్ణకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారన్నారు.



రోదిస్తున్న ధనుంజయ, శ్రీకృష్ణ కుటుంబ సభ్యులు

పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలించిన కలెక్టర్



పెనుకొండలో ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

పెనుకొండ టౌన్ , మే 12 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆధ్వర్యంలో పోలింగ్ సామగ్రిని ఆదివారం అందజేశారు. పెనుకొండ నియోజకవర్గంలో ని 265 పోలింగ్ కేంద్రాలకు 318 మంది పీఓలు, 318మంది ఏపీఓలు, 1272మంది ఓపీఓలను నియమించారు. వారందరూ వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో తరలివెళ్లారు. నియోజకకర్గంలో మొత్తం 31 సమస్యాత్మ క కేంద్రాలను గుర్తించారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 2132మంది పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,35, 986మంది ఓటర్లుండగా పురుషలు 1,17, 952, స్త్రీలు 1,18, 030 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. వారు సోమవారం తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలించామని తెలిపారు. అలాగే ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి అదనంగా రిజర్వ్‌డ్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అపూర్వభరత్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఆదివారం ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదివారం పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి సామగ్రిని అందించి, పలుసూచనలు చేశారు. సోమవారం పోలింగ్ సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఎన్ని కల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమస్యాత్మక గ్రామాలలో ఎలాంటి చర్యలు చేపట్టారని అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లపై ఆర్‌ఓ గౌరీశంకర్‌ను అడిగి తెలుసుకొన్నారు. ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులకు, సిబ్బందికి ఎన్నికల నియమావళిపై సలహాలు, సూచనలు అందజేశారు.



పెనుకొండ నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

గోరంట్లలో ఏర్పాట్లు పూర్తి



గోరంట్ల ఉర్దూ పాఠశాలలో బారికేడ్ల ఏర్పాటు

గోరంట్ల, మే 12: మండలంలోని 70 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఎన్నికల పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ అక్బుల్‌బాషా తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడ్లు, తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం వీల్ చైర్లు తదితర చర్యలు చేపట్టారు. పెనుకొండ నియో జకవర్గంలోనే ఇతర మండలాలకంటే గోరంట్ల మండలంలో అధిక సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మండలంలో మొత్తం 64,432మంది ఓటర్లు ఉండగా... అందులో 32,050మంది పురుషలు, 32,580 మహిళలు ఉన్నారు. మొత్తం తొమ్మిది సెక్టార్లలో తొమ్మిది మంది గెజిటెడ్ ఉద్యోగులను సెక్టార్ అధికారులుగా నియమించారు. అలాగే తొమ్మిది మంది రూట్ అధికారులు, 70 మంది ప్రిసీడింగ్ అధికారులు, 70మంది ఏపీఓలు, 280 మంది ఓపీఓలను నియమించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గోరంట్ల పట్టణంలో 21 పోలింగ్ కేంద్రాలుండగా, ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు.

పోలింగ్ ప్రశాంతంగా సాగేలా చూద్దాం: డీఎస్పీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రావు

మడకశిర టౌన్, మే 12: ఏ పార్టీకి చెందిన వారైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఎ శ్రీనివాస్ రావు హెచ్చరించారు. పోలింగ్ పక్రియ ప్రశాంతం గా ముగిసేలా సమిష్టిగా కృషి చేద్దామన్నారు. ఆయన ఆదివారం మడకశిర డీగ్రీకళాశాల వ ద్ద ఎన్నికల్లో పాల్గొనే పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఎన్నికల నింబధనలు పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రిసీడింగ్ అధికారుల అనుమతి మేరకు నడుచుకోవాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, క్యూ మెయింటెనెన్స్‌పై వివరాంచారు. క్యూ లైనులో ఉన్న ఓటర్లతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. మడకశిర నియోజకవర్గంలో ఎన్నికల విధులకుగాను సాయుధ బలగాలు 82 మంది, కర్ణాటక రాష్ట్రం నుంచి 189 మంది, జిల్లా పోలీసులు 64 మంది విధుల్లో పాల్గొనున్నట్లు తెలిపారు, వారితో పాటు హోంగార్డులు ఇతర సిబ్బంది పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ మనోహర్, రూరల్ సీఐ రాజకు మార్, ఎస్‌ఐలు జనార్దన్‌నాయుడు, వీరేష్, రాజశేఖర్, మునిప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అనంతపురంలో కిడ్నాప్ కలకలం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హరీశ్

మడకశిర రూరల్, మే 12: మండలంలోని ఆర్ అనంతపురం గ్రామంలో ఆదివారం రాత్రి 8గంటల సమయంలో హరీశ్ అనే యువకుడి కిడ్నాప్ కలకలం రేపింది. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం... హరీశ్‌కు అదే గ్రామంలో కొంత మందితో పాతకక్షలు ఉన్నాయి. హరీశ్ బెంగళూరుకెళ్లి చాలా కాలంగా అక్కడే పనిచేసుకుంటున్నాడు. ఓటు వేయడానికి శనివారం రాత్రి గ్రామానికి వచ్చాడు. మదర్స్ డే సందర్భంగా ఆదివారం కేక్ తీసుకురావడానికి రాత్రి 8 గంట సమయంలో స్నేహితుడితో కలసి బైక్‌పై దొమ్మితమర్రి గ్రామానికి వెళ్లాడు. కేక్ తీసుకుని తిరిగి గ్రామానికి వస్తుండగా కొందరు కాపుకాచి హరీశ్‌ను చితకబాది కారులో తీసుకెళ్లారు. కర్ణాటకలోని కనిమేడిగ్రామ సమీపం వంకలో రాడ్‌లతోబాగా కొట్టి అక్కడే వదిలేసి వెళ్లినట్లు తెలిపారు. అతడి స్నేహితుడి ద్వారా సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు వెంటనే అక్కడికెళ్లి గాయాలతో బాధ పడుతున్న హరీశ్‌ను మడకశిర ఆసుపత్రిలో చేర్పినట్లు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.